తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
02-06-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 116
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# బదిలీలకు బ్రేక్..!

- రేవంత్ సర్కార్ మళ్లీ నిషేధం
- జీవో 57 జారీ చేసిన ప్రభుత్వం
- ఆరు నెలల పాటు ఆంక్షలు
- బదిలీ కావాలంటే సీఎం గ్రీన్ సిగ్నల్ తప్పనిసరి
- ఆర్థిక శాఖ కఠిన ఉత్తర్వులు
- నిబంధనలు మీరితే జీతాల బిల్లులు కట్.. సర్కార్ వార్నింగ్
- సెన్సస్ నిబంధనతో టీచర్ల ఆశలపై చన్నీళ్లు..
- జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చిన పాత ఆంక్షలు



**ప్రత్యేక ప్రతినిధి, సిరిన్యూస్:**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలపై రేవంత్ రెడ్డి సర్కార్ తిరిగి నిషేధం విధిస్తూ కఠిన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీఓ ఎంఎస్ నంబర్ 57ను విడుదల చేస్తూ బదిలీలపై మరోసారి ఉక్కుపాదం మోపింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం, మే నెలలో తాత్కాలికంగా సడలించిన బదిలీల విండో ముగియడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జూన్ 1 నుంచి సాధారణ బదిలీలను పూర్తిగా నిషేధిస్తూ ఆర్థిక శాఖ స్పష్టమైన జీఓ జారీ చేయడంతో, రాబోయే ఆరు నెలల పాటు బదిలీల ప్రక్రియ పూర్తిగా లాక్ కానుంది. పరిపాలనలో ఎలాంటి అంతరాయం కలగకుండా, రోజువారీ పనులు స్తంభించిపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ జీఓలో కొన్ని కీలక పరిమితులు, కఠినమైన నియమాలను పొందుపరిచింది. మే నెలలో జరిగిన సాధారణ బదిలీలలో ఏ ఒక్క ప్రభుత్వ శాఖ లేదా నిర్దిష్ట కేటగిరీలోనూ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 40 శాతం కంటే ఎక్కువ మందిని బదిలీ చేయడానికి వీల్లేదని ప్రభుత్వం గట్టి నిబంధన విధించింది.

మిగతా 2 లో

# మంత్రి మాట నీటి మూటేనా?

## ఆర్టీసియన్ల సమ్మె హామీ హుళక్కేనా?!

- పక్షం రోజులుగా జాక్ నేతలకు దొరకని మంత్రి అపాయింట్మెంట్
- ఆగ్రహంతో రగులుతున్న కార్మికులు
- సర్కారు మాట నమ్మి సమ్మె విరమించి 45 రోజులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచని వైనం
- చర్చలు జరిపి 'మళ్లీ కలుద్దాం' అని చెప్పి.. ఇప్పుడు ముఖం చాటేసిన సీఎండీలు
- భట్టి అపాయింట్మెంట్ కోసం 15 రోజులుగా జాక్ నేతల నిరీక్షణ
- పెద్దన్న పాత్ర పోషించిన ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్ వద్దకు నేతలు
- నేటి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజైనా సమస్యకు పరిష్కారం లభించేనా?



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వేలాది మంది ఆర్టీసియన్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన మాట నీటి మూటగానే మిగిలిపోనుందా? గత నెలలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసియన్లు ఉధృతంగా చేపట్టిన సమ్మెను విరమింపజేయడానికి సాక్షాత్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నేటికీ నెరవేరకపోవడం విద్యుత్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమ్మె ముగిసాక ఒక పర్యాయం జాక్ నేతలను కలిసిన మంత్రి.. 'అంతా అధికారులు చూసుకుంటారు' అని ఒక్క మాటతో తేల్చేశారు. ఆ తర్వాత ట్రాన్స్‌కో, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీలు జాక్ నేతలతో చర్చలు జరిపినప్పటికీ.. ఆ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా 'మళ్లీ కలుద్దాం' అంటూ కాలయాపన చేయడంపై కార్మికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

మిగతా 2 లో

# పవన్ కల్యాణ్‌కు పోలీసుల షాక్

- నేటి 'నవనిర్మాణ సభ'కు అనుమతి నిరాకరణ!
- శాంతిభద్రతలు, ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో పోలీసుల బ్రేక్.. హైకోర్టును ఆశ్రయించిన జనసేన
- ఇది బహిరంగ సభ కాదు.. కేవలం ఇండోర్ సమావేశమే: జనసేన నేత మహేందర్‌రెడ్డి వివరణ
- తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాకే సభ పెట్టుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్
- ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే ఇక్కడ డైవర్షన్ పాలిటిక్స్: మండిపడ్డ బీఆర్ఎస్ నేత కవిత
- టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మాడు పగిలిపోతుంది.. కేసీఆర్ కుమార్తె స్ట్రాంగ్ వార్నింగ్


2



# తెలంగాణ రైతును చులకన చేస్తే ఊరుకోం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక
- ఎంత ఖర్చైనా సరే.. మహారాష్ట్రలో 2 వేల ఎకరాల భూ సేకరణకు మేం సిద్ధం
- ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలుపై కేంద్రం వెనకడుగు వేయొద్దు
- జూన్ 15 నుండి కేంద్రంపై యుద్ధమే

2




# టీబీజేపీలో ఫ్లెక్సీ పంచాయితీ!

## ఎంపీ ఈటల రాజేందర్ కు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు

- అంతర్గత కలహాలా? ప్రతిపక్షాల వ్యూహమా?
- కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో అవకాశం ఉంటున్నదన్న సమయంలోనే ఇలా..
- ఫ్లెక్సీ రాజకీయాలపై మండిపడ్డ ఈటెల వర్గీయులు
- కండించిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు

2



# ఆన్‌లైన్‌లోనే టీజీపీఎస్సీ పరీక్షలు!

ఇకపై నిర్వహించే నియామక పరీక్షలన్నీ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ మోడ్‌లోనే జరుగుతాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం తెలిపారు. దీనివల్ల పేపర్ లీకేజీలకు అవకాశం ఉండదని, పరీక్ష పేపర్‌ను ముందే తయారు చేయడం అనేది ఇకపై ఉండదని చెప్పారు. వీలైతే అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశారో కూడా తెలిసిపోయేలా సాంకేతికతను తీసుకువస్తున్నట్లు హింట్ ఇచ్చారు. ఉద్యోగ నియామకాల్లో మొదట నోటిఫికేషన్, తర్వాత పరీక్ష, ఆపై మెరిట్ లిస్ట్, చివరిగా సెలక్షన్ లిస్ట్ అనే పారదర్శక విధానాన్ని కచ్చితంగా పాటిస్తామన్నారు.

- గంట ముందే ప్రశ్నాపత్రం తయారీ.. లీకేజీలకు చెక్
- నిరుద్యోగులకు పెద్ద శుభవార్త చెప్పిన చైర్మన్
- ఆర్థిక శాఖ నుంచి 3,800 పోస్టులకు అనుమతి
- మూడు నెలలకోసారి మీడియాతో మాట్లాడుతామన్న బుర్రా

వివరాలు 3వ పేజీలో




8

# రవాణాశాఖలో భారీగా బదిలీలు!

- పలువురికి పదోన్నతులు
- అవినీతి ఆరోపణలు నేపథ్యంలోనే..
- గ్రేటర్‌లో సికింద్రాబాద్ మినహా అందరు ఆర్టీవోలు బదిలీ

తెలంగాణ రవాణాశాఖలో భారీగా బదిలీలు జరిగాయి . సాధారణ బదిలీల్లో భాగంగానే జరిగినా మునుపెన్నడు లేనంత ఎక్కువ స్థాయిలో జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్ లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి.



8

# సుప్రీంకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

8

- కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్



# నిరసనలకు సిద్ధం కండి

తాను జూన్ 6న భారత్‌కు రానున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోమవారం తెలిపారు. పరీక్ష నిర్వహణ లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో శాంతియుత నిరసన కార్యక్రమం చేపడతానని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియో రిలీజ్ చేశారు.

8



# టీబీజేపీలో ఫ్లెక్సీ పంచాయితీ!

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణా బ్యూరో,సిరి న్యూస్: తెలంగాణ భారతీయ జనతా పార్టీలో కొత్త వివాదం మొదలైంది. హైదరాబాద్ నగరంలో నిన్న రాత్రి మాజీ
మంత్రి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిసాయి. త్వరలో కేంద్ర మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న సమయంలో ఈటెల కు వ్యతిరేకంగా భారీ సంఖ్యలో ఫ్లెక్సీ లు వెలియడంతో టీబీజేపీ రాజకీయాలు ఒక్క సారిగా వేడెక్కాయి. ఇప్పటికే బండి సంజయ్ కుమారుడి ఉదంతం మూలంగా పార్టీకి కొంత మేర నష్టం వాటిల్లగా ప్రస్తుతం ఫ్లెక్సీ వివాదం ఎటునుండి ఎటు వెళ్తుందో అన్న కోణంలో ఆ పార్టీ సీనియర్ నేతలు సంసిద్ధంలో ఉన్నారు.

## అసలు ఈటెల పై పోస్టర్ లెందుకు?

ఈటెల రాజేందర్ ఏ పార్టీలో ఉన్న వివాద రహితుడు,వామపక్ష భావజాలం నుండి రాజకీయాల్లోకి వచ్చిన ఈటెల రాజేందర్ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించాడు. తెలంగాణ ఏర్పాటయ్యాక కెసిఆర్ కు అత్యంత సన్నిహితుడిగా మొదటి మంత్రివర్గంలోనే మంత్రి పదవి అధిరోహించాడు. ఆ తదుపరి రాజకీయ పరిణామాల మధ్య పార్టీ వీడి టీబీజేపీ లో చేరాడు. అనంతరం జరిగిన శాసన సభ ఎన్నికల్లో అటు హుజురాబాద్ ఇటు గజ్వేల్ లలో పోటీ చేసి ఓడిపోయాడు. ఆ తదనంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ గా పోటీచేసి గెలుపొందాడు. బీజేపీ లో కీలకంగా వ్యవరిస్తూ కేంద్ర నాయకత్వానికి సన్నిహితుడిగా మారాడు. ఆపై రాష్ట్ర అధ్యక్షుడు మార్పు సమయంలో ఈటెల పేరు మొదటి ప్రాధాన్యతలో ఉన్న కేంద్ర నాయకత్వం టీబీజేపీ లో ఉన్న పోటీ దృష్ట్యా రామచందర్ రావు ను అధ్యక్షుడిగా ప్రకటించింది. ఐనప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో అత్యంత చురుకుగా అయన పాల్గొంటూనే ఉన్నారు. ఐతే ఇటీవల బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఫోక్సో కేసులో అరెస్ట్ కావడం ఆ సంఘటనలో బండి సంజయ్ కొడుకును కాపాడటానికి ప్రయత్నించినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ సంఘటన లో బిఆర్ఎస్ పార్టీ బండి ని టార్గెట్ చేసింది. ఐనప్పటికీ పార్టీ సంజయ్ పక్షనా నిలిచింది. కానీ అంతర్గతంగా భగీరథ్ కేసు ను విస్తృత ప్రచారం చేసి బండి సంజయ్ రాజకీయ సమాధి చేయాలని స్వంత పార్టీ నేతలే ప్రయత్నిస్తున్నారని అప్పట్లో సంజయ్ అనుచరులు బాహాటంగానే విమర్శించారు. ఇక్కడ బండి సంజయ్ కొడుకు విషయంలో ఈటెల కండించలేదు ఆలా అని మద్దతు ఇవ్వలేదు దింతో సంజయ్ అనుచర గణంకు ఈటెల మౌనం ఆగ్రహం తెప్పించింది.

## ఈ సమయంలోనే ఎందుకిలా?

తెలంగాణ బీజేపీ సీనియర్ నేత మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పై అనూహ్యంగా ఫ్లెక్సీలు ఈ సమయంలోనే వెలువడం ఏంటన్నది ఇప్పటి ప్రశ్న . ఇందుకు తోడు పోస్టర్లలో సంధించిన ప్రశ్నలు కూడా రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయ. ఈటెల ఏడుపే బీజెపి కి శాపం అంటూ వెలసిన ఫ్లెక్సీల్లో బండి సంజయ్ ధర్మపురి అరవింద్ ల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా ఎదుగుతున్నదని రాయడం వెనుక అదృశ్య శక్తులు ఎవరున్నారో అర్థం చేసుకోవచ్చు. ఐతే ఇదే సమయంలో ఎందుకన్న ప్రశ్న కూడా ఉంది. దీనికి జవాబే కేంద్ర మంత్రి వర్గ విస్తరణ.. ఈటెల రాజేందర్ రానున్న కేంద్ర మంత్రివర్గ విస్తరణలో అవకాశం లభించనున్నట్టు విపరీతంగా ప్రచారంలో ఉంది.ప్రస్తుతం ఉన్న బండి సంజయ్ కొడుకు కేసు మూలంగా తప్పిస్తారని ఆ స్థానంలో ఈటెలకు అవకాశం ఇస్తారంటూ ఆ పార్టీ పెద్దలే లీకులు ఇచ్చినట్టు తెల్సింది. ఇదే ఇప్పుడు ఫ్లెక్సీ కేంద్రంగా ఈటెల పై వ్యతిరేక ప్రచారానికి కారణమైంది. ఇదే విషయాన్ని టీబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తీవ్రంగా కండించారు.ఇది ఈటెలపై ప్రతిపక్షాల కుట్ర అని ఆరోపించారు ఐతే అది ప్రతిపక్షాల కుట్ర కాదని పార్టీ అంతర్గత కుమ్ములాట మూలంగానే జరిగిందని ప్రస్తుత పరిస్థితులు చెబుతున్నయ్. ఏది ఏమైనా మంత్రి వర్గంలో ఈటెలకు స్థానం ఖరారనుకున్న సమయంలో ఇలా వ్యతిరేక ప్రచారాలు జరగడం ఆయన వర్గం నేతలు జీర్ణించుకోలెకపోతున్నారు.

# మాజీ మంత్రిని కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎంఏ ముక్తార్

**అజ్మీర్లో జన్మదినం సందర్భంగా చాదర్ సమర్పించనున్న నేతలు**

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**



ముస్లిం సోదరులకు పవిత్ర మైన దర్గా గా భావించే అజ్మీర్ షరీఫ్ దర్గాకు మైనారిటీ నాయకులు, మాజీ జెడ్. పి టి. సి సభ్యులు ఎం. ఏ ముక్తార్ ఆధ్వర్యంలో మైనారిటీ నాయకులు సోమవారం నాడు బయలుదేరారు. ఈ సందర్బంగా మాజీ మంత్రి హరీష్ రావు ను అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ నెల 3న హరీష్ రావు జన్మదిన దినం కావటం, అయన కూడా అదే రోజున ఇతర కార్యక్రమాల్లో ఉండటం తో ముందుగానే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హరీష్ రావు ను కలిసిన అనంతరం అజ్మీర్ షరీఫ్ కు బయలుదేరారు. రాష్ట్రం లో శాంతి, సామరస్యం, కోరుకుంటూ ప్రార్ధనలు చేయనున్నట్లు ముక్తార్ తెలిపారు. ప్రత్యేకంగా చాదర్ సమర్పిస్తామన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు పేరున ప్రార్ధనలు జరుపుతామన్నారు.మాజీ మంత్రి ని కలిసిన వారిలో జమ్మూఖాన్, మైనారిటీ మాజీ కార్పొరేషన్ ఛైర్మెన్ ఇంతియాజ్, అక్బర్, మేరాజ్ ఖాన్, షేకుపరీద్, జహీరాబాద్, సంగారెడ్డి ఇంచార్జి హకీమ్ ల తో పాటు మరికొందరు ఉన్నారు

# పవన్ కల్యాణ్‌కు పోలీసుల షాక్

**నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ**

**హైదరాబాద్,జూన్1:** జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెపా-ఎరు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనసేన సభను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ రైతును చులకన చేస్తే ఊరుకోం



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక
- ఎంత ఖర్చైనా సరే.. మహారాష్ట్రలో 2 వేల ఎకరాల భూ సేకరణకు మేం సిద్ధం
- ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలుపై కేంద్రం వెనకడుగు వేయొద్దు
- జూన్ 15 నుండి కేంద్రంపై యుద్ధమే

**ఆసిఫాబాద్ ప్రతినిధి:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పదేళ్ల టిఆర్ఎస్ (బీఆర్ఎస్) పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాంత రైతులకు ఘోర అన్యాయం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రెబ్బెన మండలం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు పంచాయతీ కంటే పరిష్కారమే ముఖ్యం కానీ పరిష్కారం దొరకనప్పుడే పంచాయతీ పెడతానని ఎంతటి వారైనా వదిలిపెట్టేది ఉండదని కేంద్ర ప్రభుత్వం పై, మహారాష్ట్ర ముఖ్యమంత్రి వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం

గత కాంగ్రెస్ పాలనలో, దివంగత వైఎస్సార్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణంతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సంకల్పించామని సీఎం గుర్తుచేశారు. కానీ, గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తి చేయకుండా, ఉమ్మడి ఆదిలాబాద్ ప్రయోజనాలను పూర్తిగా నీరుగార్చిందని మండిపడ్డారు.

## ఎంత ఖర్చైనా భరిస్తాం.. మహారాష్ట్ర చిన్నచూపు తగదు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ద్వారా తెలంగాణ రైతులకు నీరందించేందుకు మహారాష్ట్రలోని 2,000 ఎకరాల భూసేకరణ కోసం ఎంత ఖర్చైనా భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. “భూసేకరణ కోసం మహారాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు లేఖలు రాసినా అక్కడి ముఖ్యమంత్రి ఫడ్నవీస్ స్పందించకపోవడం దారుణం. తెలంగాణలో తీవ్రమైన సాగునీటి సమస్య ఉన్నప్పటికీ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం, తెలంగాణ ముఖ్యమంత్రిని అంత చులకనగా చూడడం సిగ్గుచేటు” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణహిత సమస్యపై మహారాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తే తెలంగాణ రైతాంగం ఊరుకోదని, తిరగబడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## కిషన్ రెడ్డి దూతగా వ్యవహరించాలి

తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నారని, ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రికి, తనకు మధ్య దూతగా (మధ్యవర్తిగా) వ్యవహరించి ఈ భూసేకరణ సమస్యను పరిష్కరించాలని సీఎం డిమాండ్ చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు సంబంధించిన ఏడు గ్రామాలను కేంద్రం కలిపినప్పుడు కేంద్రం జోక్యం చేసుకుంది, మరి ఇప్పుడు మహారాష్ట్ర సహకరించకపోతుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు.

## జూన్ 15 నుండి కేంద్రంపై యుద్ధమే

తెలంగాణలో రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు కేంద్రం ముందుకు రాకపోవడంపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యంగా ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కేంద్రం కచ్చితంగా కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాలపై స్పందించకపోతే.. జూన్ 15వ తేదీ నుండి కేంద్రంపై యుద్ధం ప్రకటించాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. రైతుల పంటలను కేంద్రం కొనుగోలు చేయని పక్షంలో జూన్ 15 నాడు ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. ఈ బహిరంగ సభలో రాష్ట్ర మంత్రులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# బదిలీలకు బ్రేక్..!

**మొదటి పేజీ తరువాయి**

## అనర్హులుగా ఉపాధ్యాయులు..

ఈ తాజా జీవో ప్రకారం, ఒక నిర్దిష్ట స్థానంలో జనవరి 1 నాటికి కనీసం 3 సంవత్సరాల నిరంతర సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు మాత్రమే బదిలీ దరఖాస్తుకు అర్హత సాధించారు. ఒకే చోట 4 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఈ విండోలో తప్పనిసరిగా స్థానచలనం కల్పించారు. మే 2027 లోపు పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులకు వారి స్వంత అభ్యర్థన ఉంటే తప్ప సాధారణ బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. అయితే, ఈ తాజా బదిలీల ప్రక్రియలో అత్యధిక వివాదానికి దారితీసింది పాయింట్ నంబర్ 11 నిబంధన. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల ప్రకారం ప్రస్తుతం దేశంలో జరుగుతున్న లేదా జరగబోయే జనగణన (సెన్సస్) విధులకు కేటాయించిన లేదా నియమితులైన ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగిని బదిలీ చేయడానికి వీల్లేదనే ఈ క్లాజ్ వల్ల రాష్ట్రంలోని వేలాది మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బదిలీలకు అనర్హులుగా మారారు. సుదీర్ఘ కాలంగా ఒకే చోట పనిచేస్తూ, ఈ వేసవిలో నచ్చిన ప్రాంతానికి బదిలీ కావచ్చని ఆశపడిన టీచర్ల ఆశలపై ఈ నిబంధన నిలువునా చన్నీళ్లు చల్లింది.

## ఉద్యోగ సంఘాల తీవ్ర అసంతృప్తి

ప్రభుత్వం బదిలీలపై మళ్లీ నిషేధం విధించడం మరియు కఠినమైన ఆంక్షలు పెట్టడంపై తెలంగాణ ఉద్యోగ జేఏసీ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. కేవలం మే నెలలో ఒకే ఒక్క నెల వ్యవధి ఇవ్వడం వల్ల వేలాది మంది అర్హులైన ఉద్యోగులు సాంకేతిక కారణాలు, సర్టిఫికెట్ల ధృవీకరణ ఆలస్యం కావడం వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయారని, ఇంతలోనే నిషేధం పెట్టడం అన్యాయమని సంఘాలు వాదిస్తున్నాయి. ఉపాధ్యాయులను సెన్సస్ పేరుతో బదిలీల నుంచి దూరం పెట్టడాన్ని టీచర్ల సంఘాలు తీవ్రంగా తప్పుబడుతూ, ఈ నిబంధనను సవరించి ఉపాధ్యాయులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతేగాకుండా, ఒకే జిల్లా లేదా పొరుగు జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తల బదిలీల దరఖాస్తులను (స్పౌజ్ కేసులు) పూర్తిగా పరిష్కరించక ముందే విండో క్లోజ్ చేయడంపై సచివాలయ ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి.

## నిబంధనలు మీరితే జీతాల బిల్లులు కట్..

తాజా ఉత్తర్వుల ప్రకారం, ఇకపై రాష్ట్రంలో ఎలాంటి బదిలీలు జరగాలన్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ తప్పనిసరిగా మారింది. ఒకవేళ ఈ ఆంక్షలను కాదని, ఆర్థిక శాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ వెనకదారిలో బదిలీలు చేపడితే సదరు అధికారుల జీతాల బిల్లులను కట్ చేస్తామని ప్రభుత్వం కఠిన హెచ్చరికలు జారీ చేసింది. నిబంధనలు మీరితే ట్రెజరీల ద్వారా శాలరీ బిల్లులను ఆపేసేలా ఆర్థిక శాఖ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వం వచ్చే ఆరు నెలల పాటు బదిలీలను పూర్తిగా లాక్ చేయడం ద్వారా పరిపాలనను స్థిరీకరించాలని చూస్తోందని అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ తాజా ఉత్తర్వుల వెనుక ఉన్న శాఖల వారీ అంతర్గత నిబంధనలపై ఉద్యోగ జేఏసీ వ్యక్తంచేస్తున్న అభ్యంతరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారాయి.

## రూ.2వేల కోట్ల బకాయిల విడుదల..

బదిలీల నిషేధం ఒకవైపు ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నప్పటికీ, మే నెల చివరి వారంలో రేవంత్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన కీలక హామీని నిలబెట్టుకోవడం కొంత ఊరటనిచ్చింది. ఉద్యోగులకు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.2వేల కోట్ల బకాయిలను (జీపీఎఫ్, కమ్యూటేషన్ బిల్లులు) ప్రభుత్వం విడుదల చేయడం ఉద్యోగ వర్గాల్లో సంతోషాన్ని నింపింది. మొత్తం 100 రోజుల్లో రూ.6వేల కోట్ల బకాయిలను క్లియర్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన మాట ప్రకారం తొలి విడత నిధులు అందడంపై జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఒకవైపు ఆర్థిక ఊరట లభించినప్పటికీ, బదిలీల జీవో 57 కారణంగా నష్టపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక మినహాయింపులు ఇచ్చి న్యాయం చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు.

# మంత్రి మాట నీటి మూటేనా?

**మొదటి పేజీ తరువాయి**

## సమ్మెలో ఒప్పించి.. ఆపై తిప్పించుకుంటున్నారు!

గత నెలలో ఆర్టీసియన్ల సమ్మె సందర్భంగా రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి ప్రజలకు అసౌకర్యం కలగొద్దనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు కార్మికులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ‘మీ సమస్యలన్నీ పరిష్కరిస్తాం.. వెంటనే సమ్మె విరమించండి’ అంటూ అప్పట్లో అధికారులు సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి సమక్షంలోనే పక్కాగా మాట ఇచ్చారు. కానీ, తీరా సమ్మె విరమించి విధుల్లోకి చేరిన తర్వాత అధికారులు ఆ వైపుగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆర్టీసియన్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను సమ్మెలో ఒప్పించి.. ఇప్పుడు డిమాండ్ల సాధన కోసం ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటున్నారని మండిపడుతున్నారు.

## దొరకని మంత్రి అపాయింట్మెంట్..

సమ్మె విరమణ అనంతరం డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేవలం ఒక్కసారి మాత్రమే జాక్ నేతలను కలిశారు. ఆ సందర్భంగా తమ డిమాండ్లపై మంత్రిని అడగగా.. ‘మేము మా మాటకు కట్టుబడి ఉన్నాం.. అధికారులతో చర్చించండి, సమస్య పరిష్కారం అవుతుంది’ అని చెప్పారు. అయితే, ఆ తర్వాత ఒక్కసారి మాత్రమే సమావేశమైన సీఎండీలు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే చర్చలు ముగించారు. ఆ తర్వాత ఇప్పటివరకు అసలు ఆర్టీసియన్ల సమస్యపై ఏ అధికారి కూడా మాట్లాడకపోవడం.. ఇక తమ డిమాండ్లు నెరవేరవు అనే సందేహాలకు తావిస్తోంది. ఇదే విషయమై ఉప ముఖ్యమంత్రితో భేటీ అయి క్లారిటీ తెచ్చుకుందామని జాక్ నేతలు గత 15 రోజులుగా ప్రయత్నిస్తున్నా.. వారికి మంత్రి అపాయింట్మెంట్ దొరకకపోవడం గమనార్హం.

## కోదండరాం, అద్దంకి దయాకర్ల శరణు కోరిన నేతలు



ఆర్టీసియన్ల సమ్మె సమయంలో కార్మికుల తరపున నిలబడి పెద్దన్న పాత్ర పోషించింది ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్. అప్పట్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమై ఆర్టీసియన్ల సమస్యలు పరిష్కరించాలని కోరింది కూడా వీరే. అయితే ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో, మంత్రి అపాయింట్మెంట్ దొరకక ఇబ్బంది పడుతున్న జాక్ నేతలు ఆ ఇద్దరు ఎమ్మెల్సీలను తరచూ కలుస్తూ తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఆర్టీసియన్లకు తక్షణమే న్యాయం చేయకుంటే వాళ్ల ఆగ్రహానికి మరోసారి విద్యుత్ రంగంలో ఉధృతమైన ఉద్యమం తప్పదన్న విషయాన్ని ఎమ్మెల్సీలకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, కోదండరాంలు.. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, తొందరపడకుండా సంయమనం పాటించాలని కార్మిక నేతలకు నచ్చజెబుతున్నారు.

## నేటి ఆవిర్భావ దినోత్సవం సందర్బంగానైన అయినా మోక్షం లభించేనా?

విద్యుత్ ఆర్టీసియన్ల సమస్య పరిష్కారానికి ఒకవైపు ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్ శ్రమిస్తుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో కార్మికులు చేస్తున్న కృషని గుర్తించి ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల ఛైర్మన్లు సైతం సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది. కానీ, సమ్మె కాలంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి తీసుకుంటున్న కొన్ని కఠిన నిర్ణయాలే ఈ సమస్య పరిష్కారానికి ప్రధాన అడ్డంకిగా మారాయనే ప్రచారం విద్యుత్ భవన్‌లో బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆశల పల్లకీలో తమ సమస్య పరిష్కారం అవుతుందనుకుంటున్న ఆర్టీసియన్లు.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2) సందర్భంగానైనా తమకు న్యాయం జరుగుతుందని గంపెడాశతో ఉన్నారు. ఆ రోజు ప్రభుత్వం ఎన్నో కీలక పథకాలను ప్రారంభిస్తుండటంతో, అందులో తమ వేతనాల పెంపు, గ్రేడ్ కన్వర్షన్ డిమాండ్ల పరిష్కారం కూడా ఉండొచ్చని నమ్ముతున్నారు. సర్కారు మాట నమ్మి సమ్మె విరమించి 45 రోజులు గడుస్తున్నా నేటికీ ఇచ్చిన మాట నెరవేరకపోవడం పట్ల ఆర్టీసియన్లలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఈ అసంతృప్తి మరోసారి సమ్మెకు దారి తీయకముందే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

# ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- రైతులను ఆదుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ రామచంద్రరావు
- నేడు ఢిల్లీలో ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడి



**న్యూఢిల్లీ, జూన్ 1 :** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటానని సీఎం చెప్పారని.. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వడ్లను కేంద్రం ఎప్పుడు కొనదని.. ఆయా రాష్ట్రాలు కొన్న దానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ధాన్యం రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉందని అన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు. సోమవారం ఢిల్లీలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతోనే ధాన్యం కొనుగోళ్ల సమస్యలు వచ్చాయని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరాటంతోనే ఆయా కొనుగోలు కేంద్రాలకు లారీలను రేవంత్ ప్రభుత్వం పంపుతోందని చెప్పారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఎవరు వెళ్తారనే విషయంపై కేంద్ర హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నేడు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దిశగా తమ పార్టీ జాతీయ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై పెట్టిన పోస్టర్లకు.. పార్టీలో గ్రూప్ తగాదాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో అంతర్గత కలహాలు సృష్టించాలనే ఈటలపై ఎవరో పోస్టర్లు పెట్టారని మండిపడ్డారు. పోస్టర్లు పెట్టిన వారిపై పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంపై డీజీపీ, కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్!

- హైదరాబాద్ లో నవ నిర్మాణ సభ ఏంటి?
- తెలంగాణ ఆవిర్భావం నాడు పదిహేను రోజులు అన్నం మానేశాడట!
- బీజేపీ ప్రాపకం కోసమే జనసేనాని యాక్టింగ్
- ముందుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్న మంత్రి పొన్నం ప్రభాకర్



**సిద్దిపేట, జూన్ 1 :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో పవన్ కల్యాణ్ నవ నిర్మాణ సభ పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. బీజేపీతో ఒప్పందం మేరకే పవన్ ఈ కొత్త నాటకానికి తెరతీశారని ఆరోపించారు. తెలంగాణను బీజేపీకి తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవ నిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దృష్టి తగిలితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎంకిపోతాయని గతంలో పవన్ అన్నారని, ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు ముందుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదకొండు రోజులు తాను అన్నం తినలేదని పవన్ స్వయంగా చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కల్యాణ్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్.. ముందుగా ఇక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్ లో నవ నిర్మాణ సభ నిర్వహించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో ఆయన మాట్లాడారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను పదకొండు రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగానే చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, ఇక్కడి ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పవన్ పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజు హైదరాబాద్ లో నవ నిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కల్యాణ్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. తెలంగాణ వాళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎంకిపోతాయి అని చెప్పిన పవన్ కల్యాణ్.. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే నవ నిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్ లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై ఆయన దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కల్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. అణువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్.. ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

# మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయి

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కు కవిత మాస్ వార్నింగ్
- రాజధాని కట్టడం చేతకాకే ఇక్కడ డైవర్షన్ పాలిటిక్స్
- ఆంధ్రా ప్రజలతో పేచీ లేదు.. నాయకులు పెత్తనం చేస్తే ఊరుకోం



**హైదరాబాద్, జూన్ 1:** ఆంధ్ర ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ రాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని ఆమె గుర్తు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కేవలం ఆంధ్ర రాజకీయ నాయకులతోనే తమ పంచాయితీ అని తేల్చి చెప్పారు. ఆంధ్ర రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ ఆంధ్ర వాళ్ల విగ్రహాలు పెడుతున్నారని, తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి ఖచ్చితంగా వస్తామని, అప్పుడు ఇక్కడ ఉన్న ఆంధ్రా నాయకుల విగ్రహాలను కూల్చేస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఉన్న సెటిలర్లు అంతా తమ వాళ్లేనని కవిత స్పష్టం చేశారు. వారు ఇక్కడికి రావచ్చు, పోవచ్చు, రొయ్యలు అమ్ముకోవచ్చని, సినిమాల షూటింగ్ లు చేసుకొని వెళ్లవచ్చని ఆమె సూచించారు. కానీ, సెక్రటేరియట్ లో ఏపీ నాయకులు గరిటె తిప్పుతామంటే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. "మేము టీఆర్ఎస్ రెండు పాయింట్ సున్నా అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునే ప్రసక్తే లేదు" అని ఆమె తేల్చి చెప్పారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో జనసేన నేతలతో పవన్ కల్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో కవిత ఘాటైన వ్యాఖ్యలు చేశారు. "పవన్ కల్యాణ్.. ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి. ఆ తర్వాత తెలంగాణలో నవ నిర్మాణ సభ పెట్టుకోండి" అని ఎద్దేవా చేశారు. మూతి పళ్లు రాలుతాయని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. గతంలో ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని, మళ్లీ తమ జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే ఇక్కడ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో నాటకాలు ఆడుతున్నారని కవిత ధ్వజమెత్తారు.



# తెలంగాణ ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు!

**రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గులాబీ బాస్ సందేశం**

**హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న కేసీఆర్ వారికి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్యయుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిగా మార్చుకున్నామని, పరిపాలన చేతకాదు అని విమర్శించిన నోళ్లు మూతపడేలా ప్రగతి పాలనను అందించామని గులాబీ అధినేత గుర్తు చేశారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ హెచ్చరించారు. ప్రతీప శక్తుల నుండి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని కేసీఆర్ సూచించారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని కోరిన ఆయన.. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ రైతన్న సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం నిరంతరం ప్రగతి పథంలో దూసుకుపోవాలని, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు, సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు కేసీఆర్ పేర్కొన్నారు.

# ఆన్ లైన్ లోనే టీజీపీఎస్సీ పరీక్షలు!

**గంట ముందే ప్రశ్నాపత్రం తయారీ.. లీకేజీలకు చెక్**

**నిరుద్యోగులకు పెద్ద శుభవార్త చెప్పిన చైర్మన్**

**ఆర్థిక శాఖ నుంచి 3,800 పోస్టులకు అనుమతి**

**మూడు నెలలకోసారి మీడియాతో మాట్లాడుతామన్న బుర్రా**

**హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణలోని నిరుద్యోగులకు టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ఒక పెద్ద శుభవార్త చెప్పారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో వేగం పెంచడంతో పాటు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సరికొత్త మార్పులు తీసుకువస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నిరుద్యోగుల్లో నమ్మకం కలిగించేలా పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని, టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని స్పష్టం చేశారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం 3,800 ఉద్యోగ పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చాయని చైర్మన్ తెలిపారు. అటవీ శాఖలో 3,093 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఇందులో 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉందని, ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇకపై క్రమం తప్పకుండా రెగ్యులర్ గా నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెల సగటున రెండు, మూడు నోటిఫికేషన్లు ఇస్తామని, జూన్ 2న మూడు కొత్త నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఉద్యోగ నియామక ప్రక్రియ ఏది ప్రారంభించినా, దాన్ని గరిష్టంగా ఒక ఏడాది లోపే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఇకపై నిర్వహించే నియామక పరీక్షలన్నీ పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ (ఆన్ లైన్) మోడ్ లోనే జరుగుతాయని తెలిపారు. దీనివల్ల పేపర్ లీకేజీలకు అవకాశం ఉండదని, పరీక్ష పేపర్ ను ముందే తయారు చేయడం అనేది ఇకపై ఉండదని చెప్పారు. వీలైతే అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశారో కూడా తెలిసిపోయేలా సాంకేతికతను తీసుకువస్తున్నట్లు హింట్ ఇచ్చారు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షల నిర్వహణ చాలా క్లిష్టమైనదని, అందుకే కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైందని అభిప్రాయపడ్డారు. ఈ విధానంలో పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నాపత్రం రూపొందించవచ్చని స్పష్టం చేశారు. టీజీపీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే దిశగా వెళ్తున్నామన్నారు. ఉద్యోగ నియామకాల్లో మొదట నోటిఫికేషన్, తర్వాత పరీక్ష, ఆపై మెరిట్ లిస్ట్, చివరగా సెలక్షన్ లిస్ట్ అనే పారదర్శక విధానాన్ని ఖచ్చితంగా పాటిస్తామన్నారు. ఇదే సమయంలో ఆయన ఒక ప్రాధాన్యత గల విషయాన్ని గుర్తుచేశారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగం ఇవ్వడం సాధ్యం కాదని, కేవలం 0.1 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు.

# తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదాం

- తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్
- మెదక్‌లో ఘనంగా టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ

**మెదక్ ప్రతినిధి:జూన్1(సిరి న్యూస్)**



తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువతను రాజకీయ చైతన్యం వైపు మళ్లించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని కోరారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటే జెండా పండుగ జెండా పండుగ కార్యక్రమం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని నియోజకవర్గ ఇంచార్జీ బట్టి అజయ్ పేర్కొన్నారు. పార్టీ జెండా ప్రజల ఆకాంక్షలకు, తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలకు ప్రతిబింబమని తెలిపారు.జెండా ఆవిష్కరణ కార్యక్రమం ద్వారా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొందని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థాగతంగా బలోపేతం చేస్తామని వెల్లడించారు.మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపగా, తెలంగాణ అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఇంచార్జ్ పీ. చంద్రశేఖర్, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ బట్టి అజయ్, జెండా పండుగ నియోజకవర్గ ఇంచార్జ్ రమేష్ గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ గణేష్, టౌన్ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కేవల్ నందకిషోర్, స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షుడు జునేద్, పిల్లికోటల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా వై. నవీన్ బాధ్యతల స్వీకారం

- వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్‌తో మర్యాదపూర్వక భేటీ

**మెదక్ ప్రతినిధి,జూన్1(సిరి న్యూస్)**



మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా గ్రూప్ 1ఆఫీసర్ వై. నవీన్ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ పరిపాలన, పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.కొత్త కమిషనర్ బాధ్యతలు స్వీకరించడంతో మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు పారదర్శక పరిపాలన అందించాలని ఆకాంక్షించారు.మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు కోరినట్లు తెలిసింది. ప్రజల సమస్యలకు త్వరితగతిన స్పందించే విధంగా కార్యాచరణ ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ తాహేర్ అలీ కూడా కమిషనర్ వై. నవీన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ పరిపాలన కొనసాగించాలని ఆ కాంక్షించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మెదక్ పట్టణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. కొత్త కమిషనర్ రాకతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊపు వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# జీడిమెట్ల డివిజన్‌లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులను తక్షణమే చేపట్టండి

- బిఆర్ఎస్ నేత వి.నరేందర్ రెడ్డి డిప్యూటీ కమిషనర్ కు వినతి.

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 1, ( సిరి న్యూస్) :**

జీడిమెట్ల డివిజన్ లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులను తక్షణమే చేపట్టండి డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్‌కు వినతిపత్రం అందజేసిన నరేందర్ రెడ్డి.అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ సర్కిల్ నుంచి రాఘవేంద్ర కాలనీ మీదుగా వెళ్లే రహదారి, గోదావరి హోమ్స్ పరిసరాలు, గాయత్రీనగర్, దుర్గా ఎస్టేట్, జీడిమెట్ల గ్రామం తదితర ప్రాంతాల్లో రోడ్లు అత్యంత దుర్భరంగా మారాయని వివరించారు. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు పడి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో రోడ్లపై గుంతలు మరింత లోతుగా మారి ప్రమాదాలకు కారణమవుతాయని, అందుకే ప్యాచ్‌వర్క్ పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. డివిజన్ పరిధిలో దెబ్బతిన్న ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ వెంటనే స్పందించి జూన్ 3 నుంచీ ప్యాచ్‌వర్క్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కృష్ణనగర్ కాలనీ అధ్యక్షుడు హరి ప్రసాద్, మహానగర్ కాలనీ అధ్యక్షుడు కుమార్, కుత్బుల్లాపూర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధి పెద్ది మల్లేష్, మురళీ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు రామచంద్ర రెడ్డి, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# తాగునీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారమెప్పుడు ?



ఎండలు మండిపోతున్న వేసవి కాలంలో తెలంగాణ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. రాజధాని హైదరాబాద్ మొదలుకొని మారుమూల గ్రామాలు, గిరిజన తండాల వరకు "దాహం.. దాహం.." అనే ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. అత్యాధునిక సాంకేతికతకు, ఐటీ కారిడార్లకు నిలయమైన హైదరాబాద్ మహానగరం నేడు దేశంలోనే అత్యంత వేగంగా భూగర్భ జలాలు అడుగంటుతున్న నగరంగా నిలవడం అత్యంత ఆందోళనకరం. చెరువుల ఆక్రమణలు, కాంక్రీట్ వనాలుగా మారిన పట్టణాలు, ప్రణాళిక లేని పట్టణీకరణ మనల్ని ఈ దుస్థితికి చేర్చాయి. ప్రభుత్వాలు మారినా, కొత్త పథకాలు తెచ్చినా ప్రజల తాగునీటి వ్యథలు మాత్రం తీరడం లేదు. హైదరాబాద్ నగరానికి నీటిని అందించే సింగూరు వంటి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు చనిపోయే (డెడ్ స్టోరేజ్) స్థాయికి పడిపోవడంతో అధికారులు అత్యవసర పంపింగ్ విధానాలను ఆశ్రయిస్తున్నారు. నగర శివార్లలోని గచ్చిబౌలి, కొండాపూర్, తెల్లాపూర్ వంటి నివాస ప్రాంతాలలో నివాసితులు కేవలం నీటి ట్యాంకర్ల కోసమే నెలకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

### ప్రైవేటు దందా...

ప్రభుత్వ సరఫరా అరకొరగా ఉండటంతో, ప్రైవేటు వాటర్ ట్యాంకర్ల యజమానులు ఇదే అదనుగా ధరలను ఇష్టారాజ్యంగా పెంచి సామాన్యుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. నగరాల్లో ఐఎస్ఐ గుర్తింపు లేని కాలుష్య కారక ప్లాంట్ల ద్వారా నాణ్యత లేని నీటిని క్యాన్లలో నింపి విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. తాగునీటి పంపిణీలోనూ సామాజిక అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఐటీ కారిడార్లు, గేటెడ్ కమ్యూనిటీలు ఉన్న ప్రాంతాలకు కొంతమేర నీరు అందుతున్నప్పటికీ, బోరబండ, సింగరేణి కాలనీ, ఎర్రగడ్డ వంటి 20కి పైగా పేద బస్తీలలో నీటి సరఫరా తీవ్రంగా దెబ్బతింది. బస్తీల్లో మహిళలు అర్ధరాత్రి వరకు ఖాళీ బిందెలతో కుళాయిల వద్ద వేచి చూడటం, కేవలం 10 నుంచి 30 నిమిషాలు మాత్రమే వచ్చే లో–ప్రెషర్ నీటి కోసం గొడవలు పడటం నిత్యకృత్యంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో 'మిషన్ భగీరథ' పైప్‌లైన్ లీకేజీలు, విద్యుత్ అంతరాయాల వల్ల కొన్ని గ్రామాలకు వారానికి ఒకసారి కూడా నీరు అందని పరిస్థితి నెలకొంది. తాగునీటి సంక్షోభాన్ని కేవలం ఒక వేసవి కాలపు తాత్కాలిక సమస్యగా చూడటం మానేసి, శాశ్వత నీటి భద్రతా వ్యూహాలను అమలు చేయాలి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మల్లన్నసాగర్ గోదావరి జలాల తాగునీటి పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.

### భూగర్భ జలాల పునరుద్ధరణ...

నగరాలు, గ్రామాల్లోని ప్రతి భవనంలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ (వర్షపు నీటి సంరక్షణ) పద్ధతులను కచ్చితంగా అమలు చేయాలి. చెరువులు, కుంటల ఆక్రమణలను నిర్దాక్షిణ్యంగా తొలగించాలి. పరిశ్రమలు, ఐటీ పార్కులలో తాగునీటి వినియోగాన్ని తగ్గించి, శుద్ధి చేసిన మురుగునీటిని వాడేలా కఠిన నిబంధనలు తేవాలి. పంపిణీ వ్యవస్థల్లో జరుగుతున్న 30–40 శాతం నీటి వృధాను, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలి. నీరు అనేది వ్యాపార వస్తువు కాదు.. అది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. ప్రభుత్వం తాత్కాలికంగా నిధులు మంజూరు చేయడం, సమీక్షలు జరపడానికే పరిమితం కాకుండా, భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా జలవనరుల నిర్వహణ చేపట్టాలి. పాలకులలో రాజకీయ చిత్తశుద్ధి, అధికారులలో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ, ప్రజలలో నీటి పొదుపుపై బాధ్యత కలిగినప్పుడే తెలంగాణను ఈ 'దాహార్తి' నుండి విముక్తం చేయగలం. ఇప్పటికైనా మేల్కొనకపోతే, ముందుందు నీటి కోసం యుద్ధాలు జరగడం ఖాయం!

# గుమ్మడిదల ప్రీమియర్ లీగ్ విజేతగా బుల్స్

- యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం
- యువతకు వేదికగా క్రీడాపోటీలు
- మరింత పెద్ద స్థాయిలో పోటీలు నిర్వహిస్తాం

**గుమ్మడిదల, జూన్ 1( సిరి న్యూస్ ):**

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన తొలి గుమ్మడిదల ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. పలువురు యువ క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలు క్రీడాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టోర్నమెంట్‌లో మొత్తం నాలుగు జట్లు పాల్గొనగా, 20 మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. ప్రతి మ్యాచ్‌లోనూ క్రీడాకారులు తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ప్రేక్షకులకు వినోదాన్ని పంచారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్లు కనబరిచిన ప్రతిభ పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో కెప్టెన్ నరేష్ నాయకత్వంలోని బుల్స్ జట్టు అద్భుత ఆటతీరుతో విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. కెప్టెన్ అంజన్ గౌడ్ సారథ్యంలో బరిలోకి దిగిన వారియర్స్ జట్టు పోరాటపటిమ ప్రదర్శించి రన్నరప్‌గా నిలిచింది. రెండు జట్లు కూడా చివరి వరకు పోటాపోటీగా ఆడి ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి.

### యువతకు వేదికగా క్రీడాపోటీలు

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నేటి యువతను క్రీడల వైపు మళ్లించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక వెనుకబడిపోతున్నారని, అలాంటి వారికి వేదిక కల్పించేందుకే ఈ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు వివరించారు.



### మరింత పెద్ద స్థాయిలో పోటీలు నిర్వహిస్తాం

ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను స్వప్నిల్, శ్రీకాంత్, పవన్ చంద్ర ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. యువత నుంచి వచ్చిన విశేష స్పందన తమకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని జట్లతో, మరింత పెద్ద స్థాయిలో క్రికెట్‌తో పాటు ఇతర క్రీడా పోటీలను కూడా నిర్వహించి యువ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. క్రీడాకారులు, నిర్వాహకులు, ప్రేక్షకుల సహకారంతో తొలి గుమ్మడిదల ప్రీమియర్ లీగ్ విజయవంతంగా ముగియడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి





- గ్రామసభలో గుమ్మడిదల ఎస్సై లక్ష్మీకాంత్ రెడ్డి

**గుమ్మడిదల, జూన్ 1( సిరి న్యూస్):**

యువత చెడు అలవాట్లు, వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో పయనిస్తూ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని గుమ్మడిదల ఎస్సై లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. గుమ్మడిదల మండల పరిధిలోని రాంరెడ్డిబావి గ్రామంలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ సామల మహిపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గుమ్మడిదల ఎస్సై లక్ష్మీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో ఎదురవుతున్న సమస్యల పైన చర్చించడం జరిగింది దాతల సహకారంతోపాటు గ్రామ ప్రజల ప్రోత్సాహంతో ప్రభుత్వ అధికారుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకుపోవడానికి కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ మహిపాల్ రెడ్డి తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ నేటి యువత మద్యం, మత్తు పదార్థాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాలు వ్యక్తిగత జీవితాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవ వంటి సృజనాత్మక కార్యక్రమాల వైపు మళ్లించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో ప్రాణనష్టం నుంచి రక్షణ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యువత చట్టాలను గౌరవించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామసభలో ప్రజా సమస్యలు, గ్రామాభివృద్ధి అంశాలపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయేందర్ రెడ్డి, వార్డు సభ్యులు ఝాన్సీ, అభిలాష్ గౌడ్, రమ్య, మానస, కృష్ణ గౌడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ దయాకర్ రెడ్డి, సెక్రటరీ పద్మ, గ్రామ ప్రజలు, యువకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే లక్ష్యం..

## 24 పార్కుల అభివృద్ధికి శ్రీకారం

## తెల్లాపూర్‌లో రూ.1.40 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన



**రామచంద్రాపురం, జూన్ 1 (సిరి న్యూస్):**

ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలోని డివిజన్లలో 24 పార్కుల అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, వినోద అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక నిధులతో పార్కులను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.సోమవారం తెల్లాపూర్ డివిజన్‌లోని కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్-2 కాలనీ పార్కు, హుడా కాలనీ పార్కు-2లో రూ.1.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ప్రశాంతమైన వాతావరణం అందించడంలో పార్కులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పిల్లలు, యువత, వృద్ధులు అందరూ ఉపయోగించుకునేలా పార్కులను సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఈ పార్కులు దోహదపడతాయని చెప్పారు.పార్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటి పరిశుభ్రత, సంరక్షణలో కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం తహసిల్దార్ సరస్వతి, డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈఈ సురేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ లలిత సోమిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, డీఈ కృష్ణవేణి, యూబీడీ మేనేజర్ విక్రమ్, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఎదుగుదలకు కృషి చేస్తున్న ప్రభుత్వం.

## 23 వ వార్డు కౌన్సిలర్ శ్రీ లక్ష్మీ ప్రియ భరత్.



**సదాశివపేట. జూన్ 1. (సిరి న్యూస్)**

సోమవారం నాడు వార్డు కౌన్సిలర్ శ్రీ లక్ష్మీ ప్రియ భరత్ చేతుల మీదుగా మహిళలకు ఇందిరమ్మ చీరలు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ శ్రీ లక్ష్మీ ప్రియ భరత్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి మహిళా స్వయం సహాయక సంఘం అక్కాచెల్లెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా ఇందిరమ్మ చీరలు ఇవ్వడం జరిగిందని, రాష్ట్రంలో ప్రతి ఒక్క మహిళ ధనిక మహిళల ఎదగాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్చార్జి, కాంగ్రెస్ నాయకులు శరత్ చంద్ర, డ్వాక్రా మహిళలు, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిమాపకాలపై అవగాహన సదస్సు.



**సదాశివపేట. జూన్ 1. (సిరి న్యూస్)**

వాలంటరీ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ లో భాగంగా సోమవారం నాడు ఎంఆర్ఎఫ్ మెదక్ ప్లాంట్లో ఫైర్ సేఫ్టీ పైన అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో దాదాపు 60 మంది వరకు వాలంటీర్స్ పాల్గొన్నారు. సంగారెడ్డి ఎస్ ఎఫ్ ఓ శ్రీకాంత్ రెడ్డి, సదాశివపేట ఎస్ఎఫ్ఐ బిక్షపతి ఫైర్ సేఫ్టీ వీరి ఆధ్వర్యంలో ఫైర్ మెథడ్స్ పైన అగ్నిమాపకాలు జరిగినప్పుడు ఏ విధంగా స్పందించాలో పాటించాల పైన అవగాహన కల్పిస్తూ డ్రిల్స్ చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ సిబ్బంది, ఫైర్ స్టేషన్ సదాశివపేట సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# అక్కన్నపేటలో పర్యావరణం పై సదస్సు.




**రామాయంపేట, జూన్ 1 (సిరి న్యూస్)**

రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో 99 రోజుల ప్రణాళికలో సోమవారం నాడు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక భాగంగా పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, ఎఫ్ ఆర్ ఓ విద్యాసాగర్ రావు ,డి ఆర్ ఓ శ్రీనివాస్ ,బీట్ ఆఫీసర్ లక్ష్మణ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకు అవమానం పైతాసిల్దార్ కు ఫిర్యాదు.





- **బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.**
- **భారతీయ జనతా పార్టీ నాయకుల డిమాండ్.**

**రామాయంపేట, జూన్ 1 (సిరి న్యూస్)**

రామాయంపేట మార్కెట్ యార్డులో ప్రారంభించిన జొన్నల కొనుగోలు కేంద్రం కార్యక్రమానికి మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు ను ఆహ్వానించక పోవడం, అలాగే జొన్నల కొనుగోలు కేంద్రం కోసం గత 45 రోజులుగా నిరంతరంగా కృషి చేసిన భారతీయ జనతా పార్టీ ప్రజాప్రతినిధులను, సర్పంచులను పూర్తిగా పక్కన పెట్టి కార్యక్రమాన్ని నిర్వహించడం అత్యంత బాధాకరమైన మరియు ఖండించదగిన విషయమని స్థానిక బిజెపి నాయకులు విమర్శించారు.జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, దంతేపల్లి సర్పంచ్ బాలరాజ్, లక్ష్మాపురం సర్పంచ్ నవీన్ గౌడ్, అక్కన్నపేట సర్పంచ్ యాదగిరి, ఇతర పార్టీ నాయకులు కలిసి ఎంపీ రఘునందన్ రావు ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎమ్మార్వోలను కలిసి రైతుల సమస్యను వివరించి కేంద్రం మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారన్నారు.ఇంత కృషి చేసిన వారిని ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించకుండా, వారు అక్కడికి చేరుకునే లోపే కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రజాప్రతినిధుల గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా బిజెపి నాయకులు అభివర్ణించారు.ప్రజల కోసం పోరాడి సాధించిన ఫలితాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దొంగచాటుగా ప్రారంభించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.ఈ ఘటనపై భారతీయ జనతా పార్టీ నాయకులు స్థానిక ఎమ్మార్వో ను కలిసి జరిగిన విషయాన్ని పూర్తిగా వివరించారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ముందు మెట్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్వో ఘటనపై విచారణ చేసి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, దంతపల్లి సర్పంచ్ బాలరాజ్, లక్ష్మాపురం సర్పంచ్ నవీన్ గౌడ్, రామాయంపేట కౌన్సిలర్ శంకర్ గౌడ్, అక్కన్నపేట సర్పంచ్ యాదగిరి, అలాగే దంతపల్లి, లక్ష్మాపూర్, అక్కన్నపేట తదితర గ్రామాల రైతులు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.రాజకీయాల్లో భేదాభిప్రాయాలు సహజమే. కానీ ప్రజల కోసం కష్టపడి పనిచేసిన ప్రజాప్రతినిధులను అవమానించడం, కార్యక్రమాలకు దూరంగా ఉంచడం సరైన పద్ధతి కాదు. అధికారంలో ఉన్నవారు అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులను సమానంగా గౌరవించాల్సిన బాధ్యత ఉంది.అందువల్ల ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని భారతీయ జనతా పార్టీ రామాయంపేట మండల శాఖ డిమాండ్ చేసింది.

# నాణ్యమైన భౌతికశాస్త్ర బోధనకు గీతం ప్రోత్సాహం

- **ఫిజిక్స్ అధ్యాపకుల వృత్తి వికాస శిక్షణా కార్యక్రమం ప్రారంభం**

**రామచంద్రపురం.(పటాన్చెరు), జూన్ 1 (సిరి న్యూస్):**

భౌతికశాస్త్ర బోధనలో నాణ్యత పెంపొందించడంతో పాటు అధ్యాపకులకు ఆధునిక బోధనా పద్ధతులపై అవగాహన కల్పించేందుకు గీతం డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల వృత్తి వికాస శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది.ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ (ఐపీఏ) విశాఖపట్నం విభాగం సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భౌతికశాస్త్ర రంగంలోని ప్రముఖ నిపుణుల నుంచి ఆధునాతన భావనలు, బోధనా విధానాలను అధ్యాపకులు తెలుసుకుని విద్యార్థులకు అందించాలని సూచించారు.గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా మాట్లాడుతూ, మూడు రోజుల పాటు సైద్ధాంతిక, ఆచరణాత్మక అంశాలపై శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు.గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంత రామకృష్ణ మాట్లాడుతూ, భౌతికశాస్త్రం విజ్ఞానానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం "విద్యుదయస్కాంతత్వం – కొన్ని నిజ జీవిత అనువర్తనాలు" అంశంపై సాంకేతిక సెషన్ నిర్వహించారు.గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. రెజా విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న పరిశోధన, ప్రయోగశాల సదుపాయాలను పరిచయం చేశారు.కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ మాజీ ఆచార్యుడు నటరాజన్, గీతం విశిష్ట ఆచార్యుడు



ప్రొఫెసర్ జి. రవికుమార్ పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని డాక్టర్ జి. సాయిప్రీతి, డాక్టర్ టి. విశ్వం సమన్వయం చేస్తున్నారు.

# ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం.

- **ఆర్ వెంకటాపూర్ సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి..**

**రామాయంపేట, జూన్ 1 (సిరి న్యూస్)**

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, అయితే ఉద్యోగ సమయంలో మంచి పేరు సంపాదించుకోవాలని ఆర్ వెంకటాపూర్ సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి తెలిపారు.రామాయంపేట మండలంలోని వెంకటాపూర్ (ఆర్) గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్యామల కు సోమవారం నాడు వీడ్కోలు సభ నిర్వహించారు.అయితే



ఆర్ వెంకటాపురం గ్రామ కార్యదర్శిగా శ్యామల 02-09-2020 నుండి 31-05-2026 వరకు పని చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామసర్పంచ్ ఉమా సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బందారు మహేందర్ రెడ్డి తో పాటు మల్లారెడ్డి, బాపురెడ్డి,ఉప సర్పంచి అనురాద నరేశ్.వార్డు సభ్యుల సునీల్,స్వామి,అక్షిత కుమార్,కవిత చిరంజీవి,నాగరాణి రాజాగౌడ్,కారోబర్ రత్నం,ఆశవర్కర్స్ అంగన్వాడి టీచర్లు యంపిడబ్లు వర్కర్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం.

- **నిరుపేదలందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించే దిశగా అడుగులు.**
- **ఆరోగ్య పరీక్షల చేయించుకున్న కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్**

**మెదక్ జూన్,01(సిరిన్యూస్)**




ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సేవలు అభినందనీయం అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ,సౌజన్యంతో మెడిసిటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరము, నిర్వహించారు.మేడ్చల్ మెడిసిటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి ఉచిత మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అదనపు కలెక్టర్ నగేష్ వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించే దిశగా రెడ్ క్రాస్ సొసైటీ ముందుకు వచ్చిందని, వైద్య శిబిరం ఏర్పాటు చేసి జిల్లా అధికారులతో పాటు ప్రజలకు అన్ని పరీక్షలు నిర్వహించుకున్నారని , అలాగే ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు.ఈకార్యక్రమం లో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. శ్రీరాం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి శ్రీనివాస్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్. శ్రీనివాస్ రావు, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి, ఎస్సై సత్యనారాయణ, సభ్యులు శంకర్ దయాళ్ చారి, తోట శ్రీనివాస్, వేణు పాల్గొని పేషంట్లకు సేవలందించారు.





# రైతుభీమా డబ్బుల వివాదం

- కన్నతల్లిని హత్య చేసిన కుమారుడు.
- నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించిన న్యాయస్థానం.
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.



**మెదక్ జూన్,01(సిరిన్యూస్)**

రైతుభీమా డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం కారణంగా కన్నతల్లిని కత్తితో హత్య చేసిన కుమారుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.హవేళీఘనపూర్ మండలం తోగిట గ్రామానికి చెందిన పుష్ఠి నర్సమ్మ, లచ్చయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. నర్సమ్మ తల్లి పుష్ఠి బాలమణి మరణించడం, రెండో కుమారుడు అనారోగ్యంతో మృతి చెందడం నేపథ్యంలో రైతుభీమా డబ్బుల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య తరచూ విభేదాలు నెలకొనేవి. ఈ క్రమంలో నర్సమ్మ కుమారుడు పుష్ఠి బాను ప్రసాద్ డబ్బుల విషయమై తల్లితో గొడవపడ్డాడు.వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో 2023 ఆగస్టు నెలలో ఆగ్రహానికి లోనైన బాను ప్రసాద్ కత్తితో తల్లిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి హవేళీఘనపూర్ ఎస్ఐ ఆనంద్ గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం మెదక్ రూరల్ సీఐ విజయ్ కుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ జార్జ్ కేసు విచారణ సందర్భంగా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, నిందితుడు పుష్ఠి బాను ప్రసాద్‌పై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించారు. దీంతో అతనికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ ఎండీ గౌస్, ప్రాసిక్యూషన్ బృందాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# మహిళాభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

- 16వ వార్డు కౌన్సిలర్ కొత్తగొల్ల లావణ్య చంద్రశేఖర్.

**సదాశివపేట. జూన్ 1. (సిరిన్యూస్)**



సదాశివపేట పట్టణంలో 16 వ వార్డ్ గొల్లకేరి గొల్ల కురుమ కమిటీ హాల్ లో మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ కొత్తగొల్ల లావణ్య చంద్రశేఖర్, కొత్త గొల్ల చంద్రశేఖర్, ఆర్.పి రమాదేవి హాజరయ్యారు. చీరల పంపిణీ కార్యక్రమం అనంతరం కౌన్సిలర్ కొత్త గొల్ల లావణ్య చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న ముఖ్యమంత్రి యనుముల రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ప్రతి పేద మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతో తీసుకువచ్చిన పథకాలు మహిళలకు ఉచిత బస్సు 200 యూనిట్లు, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, సన్న బియ్యం, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇలా అనేక పథకాలతో ముందుకు సాగుతున్న సందర్భంలో మన వార్డులో చీరలు పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. అలాగే టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి సహకారంతో వార్డ్ నీ అభివృద్ధి చేసుకుందామని మాట్లాడటం జరిగింది.ఈ కార్యక్రమంలో సదాశివపేట కాంగ్రెస్ నాయకులు కొత్త గొల్ల చంద్రశేఖర్, సున్నం కృష్ణ, సిద్ధల పెంటయ్య, కొత్త గొల్ల గోపాల్, కొత్త పెంటయ్య, నల్ల జయరాం గౌడ్, పార్నంది పెద్ద ఎల్లయ్య, 16వ వార్డ్ లో ఉన్న 26 సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనటం జరిగింది.

# ఇబ్బందులు పడకుండా బిల్లులను సకాలంలో చెల్లించాలి

- గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల, జూన్ 1( సిరి న్యూస్):**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసిన లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా బిల్లులను వెంటనే విడుదల చేయాలని గుమ్మడిదల పురపాలక సంఘం చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్ సూచించారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామానికి చెందిన బదనపురం కవిత, మరిగని నాగమణి నూతన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా నిర్మాణం పూర్తయిన సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రమ్మ గృహాల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇంద్రమ్మ గృహాల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలు గౌరవ ప్రదమైన జీవనాన్ని గడిపే అవకాశం కలుగుతుందన్నారు.బిల్లుల ఆలస్యంతో లబ్ధిదారులకు ఇబ్బందులు ఇంద్రమ్మ గృహాల నిర్మాణం చేపట్టిన పలువురు లబ్ధిదారులు బిల్లులు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిర్మాణ సామగ్రి కొనుగోలు, కూలీల చెల్లింపుల కోసం అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేస్తున్న కుటుంబాలు బిల్లుల ఆలస్యంతో మరింత భారాన్ని భరిస్తున్నారని పేర్కొన్నారు. పనులు పూర్తిచేసిన వారికి బిల్లులు ఆలస్యం కాకుండా విడుదల చేస్తే వారికి ఎంతో ఊరట లభిస్తుందని అన్నారు. లబ్ధిదారులు అప్పుల భారంతో ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ బిల్లుల చెల్లింపును వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వైస్ చైర్మన్ సంధ్య విజయలక్ష్మి, మాధవి, చక్రపాణి, కుమార్ గౌడ్, నరేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, స్థానిక నాయకులు సురభి నాగేందర్ గౌడ్ ఆంజనేయులు, మేకల యాదగిరి, తుపాకుల రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టులో నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తా





- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ
- మన్‌సాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

**జోగిపేట, మే 01,(సిరి న్యూస్):**

ఆగస్టులో అందోలు నర్సింగ్ నర్సింగ్ కళాశాల, హస్టల్‌ను ప్రారంభిస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం అందోలు మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం చివరి దశలో ఉన్న పనులన్నింటిని పూర్తి చేయించి ఆగస్టు మాసంలో ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని, నర్సింగ్ విద్యలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా నర్సింగ్ ఎడ్యుకేషన్‌ను మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ అన్నారు. అందోలు వద్ద నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, హస్టల్ భవన నిర్మాణ పనులను, నూతనంగా మంజూరైన ఫార్మసీ కళాశాల భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నర్సింగ్ కళాశాల విద్యార్థినిలతో ముఖాముఖీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. నర్సింగ్ కళాశాల భవనం, వసతి గృహాలను త్వరలో ప్రారంభించేందుకు సివిల్ పనులను శరవేగంగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ హస్టళ్ల పరిశీలన

జోగిపేటలోని బీసీ, ఎస్సీ సాంఘీక సంక్షేమ హస్టళ్లను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యంగా ఉన్న పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. రూ.80 కోట్లతో చేపడుతున్న అజ్జమర్రి బ్రిడ్జి పనులను మంత్రి పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మన్ సాన్ పల్లి లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎంతో కీలకమైన గృహ ప్రవేశాల మహోత్సవం జిల్లాలో సోమవారం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఆందోల్ మండలం మన్సాన్‌పల్లిలో నీరుడి జ్యోతి, గొల్ల లావణ్య, వంగ సుజాత లబ్ధిదారుల ఇండ్లను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులచే గృహ ప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. దశాబ్దాలుగా గూడు కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్‌లు పీ.శ్రీనివాస్, కౌశికె రాజశేఖర్, అరుణ్ కుమార్, కొ అప్షన్ సభ్యులు ప్రవీణ్ కుమార్, జీషాన్, మాజీ చైర్మన్ జీ.మల్లయ్య, మాజీ కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, రంగ సురేష్, నాని నాగరాజ్, పీ.దుర్గేష్, పి.లక్ష్మణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# తెలంగాణ గుండె చప్పుడు రాజేంద్ర పై ఆరోపణలు తగవు.

## టీ బిజెపి రాష్ట్ర నాయకుడు పంజా విజయ్

**రామాయంపేట, జూన్ 1 (సిరి న్యూస్)**



తెలంగాణ గుండె చప్పుడు రాజేంద్ర బీజేపీ అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రజానాయకుడని,అలాంటి నాయకుడిపై ఇటీవల కొందరు రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని టీబీజేపీ రాష్ట్ర నాయకులు పంజా విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజల్లో రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు అసత్య ప్రచారాలకు తెరలేపడం దురదృష్టకరమని అయన అన్నారు .రాజేంద్ర తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల గొంతుకగా నిలుస్తూ, తెలంగాణ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకుడు. ఆయన రాజకీయ జీవితం పదవుల కోసం కాదు, ప్రజల కోసం అంకితమైన సేవా ప్రయానమని అలాంటి నాయకుడిపై అసత్య ప్రచారాలు తాత్కాలికం...ప్రజల విశ్వాసం శాశ్వతం... రాజేంద్ర నాయకత్వం తెలంగాణ భవిష్యత్తుకు భరోసా అని పంజా విజయ్ తెలిపారు

# వెల్దుర్తి తాహాసిల్దారు గా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి

**వెల్దుర్తి,జూన్ 01,( సిరి న్యూస్):**



వెల్దుర్తి మండల తహసిల్దారు గా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డి ఏ ఓ గా విధులు నిర్వహిస్తున్న ఆమె ను జిల్లా కలెక్టర్ వెల్దుర్తి తాహాసిల్దార్ గా నియమించారు.

# భూమి వివాదంలో ముగ్గురు పై దాడి!!

## ఇద్దరికీ తీవ్ర గాయాలు నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలింపు

**శివంపేట జూన్ 1 ( సిరి న్యూస్ )**



మెదక్ జిల్లా శివంపేట మండలం గూడూరులో ముగ్గురిపై దాడి, హత్యాయత్నం ఇద్దరికీ తీవ్ర గాయాలు ఆదివారం రాత్రి మహమ్మద్మోజం ఖురేషి అతని కొడుకులు ఎండి ఇలియాస్ , ఇర్ఫాన్ కురుషి లపై ముకుమ్మడి దాడి మోజం కురిషి తమ్ముడు అబ్దుల్ రహమాన్, ముగ్గురు కొడుకులు, మనవడు కలిసి హత్యకు యత్నం పాత కక్షలతో, ఆస్తి వివాదాల కారణంగా దాడి చేయగా పోలీసులకు ఫిర్యాదు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

# వెల్దుర్తి మేజర్ పంచాయతీ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ

**వెల్దుర్తి జూన్ 01,(సిరి న్యూస్):**



వెల్దుర్తి మేజర్ పంచాయతీ సెక్రెటరీగా కృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టడం జరిగింది. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన బలరాం రెడ్డి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో నూతన పంచాయతీ సెక్రెటరీ గా ఛార్జ్ తీసుకోవడం జరిగింది, ఈ సందర్భంగా వెల్దుర్తి గ్రామ సర్పంచ్ ఆదర్శ్ ఉపసర్పంచ్ శ్రవణ్ వార్డ్ మెంబర్ శ్రీనివాస్ గౌడ్ వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో తేజస్వినికి సీటు

## పదో తరగతిలో ప్రతిభతో మండల టాపర్ గా నిలిచిన విద్యార్థిని

**గుమ్మడిదల, జూన్ 1 (సిరి న్యూస్):**



మున్సిపాలిటీ కేంద్రమైన గుమ్మడిదలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పుట్నాల తేజస్విని ప్రతిష్ఠాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో (ఆర్‌జీయూకేటీ) సీటు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. తన ప్రతిభతో ఉన్నత విద్యలో మరో ముందడుగు వేసిన తేజస్వినిపై ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో తేజస్విని 565 మార్కులు సాధించి మండల స్థాయిలో టాపర్‌గా నిలిచింది. విద్యలో చూపిన ప్రతిభ, కృషి, పట్టుదల ఫలితంగా 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించింది. ప్రవేశ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ఎంపికలోనూ ప్రతిభ కనబరిచి సీటు దక్కించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, కృషితో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తేజస్విని నిరూపించిందన్నారు. ఆమె విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తేజస్విని విజయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ, కృషి కీలక పాత్ర పోషించాయని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని సాధించిన ఈ ఘనత పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచిందన్నారు. ఈ సందర్భంగా తేజస్వినిని, ఆమె తల్లిదండ్రులను, ఉపాధ్యాయ బృందాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యారంగంలో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ జూన్,01(సిరిన్యూస్)**



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.ఈ నెల 2న మంగళవారం , జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి డీఎస్పీ ప్రసన్నకుమార్, డిపిఆర్ఓ రామచంద్ర రాజు తో కలిసి జిల్లా కలెక్టర్ అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి ఒక్కరికి తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ నేపథ్యంలో సభా ప్రాంగణం, వేదిక, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు.వేడుకలకు హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం వివరాలు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 7:45 గంటలకు ముఖ్య అతిథి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తారు. 8 గంటల నుంచి 8:10 గంటల లోపు జాతీయ జెండాను ఆవిష్కరించాక, పోలీస్ శాఖచే గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం 8:10 గంటల నుంచి 8:30 గంటల వరకు జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్య అతిథి ప్రసంగపాఠం చదివి వినిపిస్తారు.ఈ సందర్భంగా 8:30 గంటల నుంచి 8:45 వరకు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో తెలంగాణ రాష్ట్ర సాధనను స్ఫురింపజేసే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ8:45 గంటల నుంచి 9 గంటల వరకు అమరవీరులకు సన్మానం వివిధ కార్యక్రమాలు ఉంటాయన్నారు.



# ప్రకృతి సంరక్షణే శ్రీరామ రక్ష.!

- **ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై సమీక్ష.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ జూన్,01(సిరిన్యూస్)**






ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ , అదనపు కలెక్టర్ నగేష్ డీఎఫ్ఓ జోజి, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి జో.జి తో కలిసి కార్యక్రమాల నిర్వహణ, కార్యాచరణ ప్రణాళిక, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపు చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమసింగ్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా మొక్కల నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు, విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రకృతి సంరక్షణపై చర్చా వేదికలు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థాయిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని అటవీశాఖ, రేంజ్ ఆఫీసర్స్ వ్యవసాయ, వైద్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట తప్పిన సీఎం రేవంత్..

- **3న సంగారెడ్డి పర్యటనను అడ్డుకుంటాం**
- **వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం**
- **రెండున్నరేళ్లు గడుస్తున్నా పింఛన్ల పెంపు హామీ అమలు శూన్యం**
- **ఎంఆర్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ ఫైర్**

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్లు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులను దారుణంగా విస్మరించిందని ఎంఆర్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి తీరుపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం, పింఛన్‌దారులను ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి దివ్యాంగుల పింఛన్‌ను ప్రస్తుతం ఉన్న రూ. 4,000 నుంచి రూ. 6,000 కు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్‌ను రూ. 2,000 నుంచి రూ. 4,000 కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పింఛన్ల పెంపుపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోకపోతే, ఈ నెల 3న సంగారెడ్డి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని బుచ్చేంద్ర మాదిగ హెచ్చరించారు. ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో వేలాది మంది పింఛన్‌దారులతో కలిసి సీఎంను అడ్డుకుని తీరుతామని ఆయన స్పష్టం చేశారు.



# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం





- **పండగ వాతావరణం లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు**
- **గంగారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన**
- **టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

**కొండాపూర్ జూన్ 01 (సిరిన్యూస్ )**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎంతో కీలకమైన గృహప్రవేశాల మహోత్సవం కొండాపూర్ మండలం గంగారంలో సోమవారం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వయించారు.సీఎం రేవంత్ రెడ్డి అసిఫాబాద్లో ఇందిరమ్మ ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేసిన నేపథ్యంలో సంగారెడ్డి అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇండ్లను టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గారు ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. దశాబ్దాలుగా గూడు కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని కల్పించే ఆస్తి అని పేర్కొన్నారు.అర్హతగలిగిన కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, సొంత ఇంటి కల నిజం కావడం జీవితంలో మరచిపోలేని ఆనందమని వ్యక్తం చేశారు.ప్రభుత్వం తమ కుటుంబాలకు శాశ్వత భద్రతను కల్పించిందని, సమాజంలో ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల పార్టీ అధ్యక్షులు పి. మల్లారెడ్డి, నాయకులు నరసింహ రెడ్డి, గొల్లపల్లి పిఏసియస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ సరిత అశోక్, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

# పేదలకు అండగా ఉంటాను:

**సంఘ సేవకులు, కాంగ్రెస్ నాయకులు కట్టే శ్రీకాంత్ యాదవ్..**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 1, (సిరిన్యూస్ ):**
పేద ప్రజలకు సాధ్యమైనంత సేవలందించేందుకు కృషి చేస్తానని సంఘ సేవకులు, కాంగ్రెస్ నాయకులు కట్టే శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం గిరి నగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్‌లోని సాయి విద్యానికేతన్ పాఠశాల కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికురాలు కవితకు పదవ తరగతి చదువుతున్న ఆమె పిల్లల చదువుల కోసం ఎస్.ఎఫ్.ఏ వంగాల గణేష్‌తో కలిసి పాఠ్యపుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు, పేదలకు, వృద్ధులకు కొన్ని సంవత్సరాలుగా వివిధ రకాలుగా సామాజిక సేవలందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా తన సేవలను విస్తృతం చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికురాలు సదరు దాత శ్రీకాంత్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# బీజేపీకి గజ్వేల్ నేత కమ్మారి శ్రీనివాస్ రాజీనామా..

**జనసేన పార్టీలో చేరిక!**

**గజ్వేల్ టౌన్, జూన్ 01, (సిరిన్యూస్ ):**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ భారతీయ జనతా పార్టీ నాయకుడు కమ్మరి శ్రీనివాస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి సోమవారం రోజున రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు పంపించారు. వ్యక్తిగత కారణాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలోనే తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి వైదొలుగుతున్నట్లు శ్రీనివాస్ తన లేఖలో స్పష్టం చేశారు. పార్టీ పట్ల తనకు ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని, అయితే అనివార్యమైన వ్యక్తిగత పరిస్థితుల వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావుకు అత్యంత ఆప్తుడిగా, నమ్మినబంటుగా కమ్మారి శ్రీనివాస్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలు అందించారు. గజ్వేల్ నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్న శ్రీనివాస్ అకస్మాత్తుగా రాజీనామా చేయడం స్థానిక బీజేపీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నప్పటికీ... రేపు (మంగళవారం) జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో తాను జనసేన పార్టీలో చేరుతున్నట్లు కమ్మారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు.



# నూతన మున్సిపల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్



**గజ్వేల్ టౌన్, జూన్ 01,(సిరిన్యూస్ ):**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా సోమవారం రోజు బాధ్యతలు స్వీకరించిన గణేష్ రెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగ్ రావు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో ఆయనను కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి పాలకమండలి తో కలిసి నూతన కమిషనర్ సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ఆనందోత్సాహంగా ఇందిరమ్మ గృహ ప్రవేశాలు

- **ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి చేతుల మీదుగా ఇందిరమ్మ గృహప్రవేశలు**

**నంగునూరు, జూన్ 01, (సిరిన్యూస్ )**



నంగునూరు మండల కేంద్రంతో పాటు, పాలమాకుల, అప్పలాయిచెర్వు గ్రామాలలో సోమవారం ఘనంగా పండుగ వాతావరణంలో ఆనందోత్సాహంగా ఇందిరమ్మ నూతన గృహప్రవేషాలు జరిగాయి. ఈ సందర్భంగా ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు ప్రజాపాలన ప్రభుత్వంకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామికి మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, మహబూబ్ అలీ, హోసింగ్ ఏఈ రవి, సర్పంచులు ఓజాలు యాదవ్, బాల పోచయ్య, ఉపసర్పంచ్ లు శ్రీధర్ గౌడ్, ఏటి చంద్రం, పంచాయతీ కార్యదర్శులు, నితీష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెలికాని యాదగిరి, దాసరి కిషన్, రాగుల కృష్ణ, రచ్చ సిద్దు, తుపాకుల శ్రీనివాస్, ఈజాజ్, పాక్స్ డైరెక్టర్ గంగుల రవి, భాస్వరాజు రాములు, శ్రీను, రాజులు పాల్గొన్నారు.

# రవాణాశాఖలో భారీగా బదిలీలు!

## కీలకమైన మేడ్చల్, ఇబ్రహీంపట్నం ఆర్టీవో పోస్టులు ఖాళీ




**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

.ఆర్టీవో నుంచి సీనియర్ అసిస్టేంట్ వరకు మొత్తం 234 మంది అధికారులను, ఉద్యోగులను బదిలీ చేశారు.ఇదే సమయంలో నలుగురు ఎంవీఐలకు ఆర్టీవోలుగా , ఆరుగురు సీనియర్ అసిస్టేంట్లకు అడ్మినిస్ట్రేటివ్ (ఏవో) గా పదోన్నతులు కల్పించారు. చాలా కార్యాలయాలలో ఆర్టీవోతో

పాటు మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్లను పెద్ద మొత్తంలో బదిలీలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 మంది ఆర్టీవోలను, 93 మంది మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్లను, 85 మంది అసిస్టేంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్లను బదిలీ చేశారు. 26 మంది అడ్మినిస్ట్రేటివ్ అధికారులు (ఏవో)లను, 19 మంది సీనియర్ అసిస్టేంట్లను బదిలీ చేస్తు రవాణాశాఖ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో కీలకమైన రెండు కార్యాలయాలలో ఆర్టీవోలుగా పని చేస్తున్న ఇద్దరిని బదిలీ చేసి ఆ స్థానాలను భర్తీ చేయక పోవడంపై చర్చజరుగుతుంది.

### నలుగురు ఎంవీఐలకు ఆర్టీవోలుగా పదోన్నతి

సీనియర్ ఎంవీఐలుగా పని చేస్తున్న నలుగురికి ఆర్టీవోలుగా పదోన్నతి కల్పించారు. మల్టిd జోన్ – 1 పరిధిలో పని చేస్తున్న టి. సంతోష్‌కుమార్ కు ఆర్టీవోగా పదోన్నతి కల్పించారు. మల్టిdజోన్ –2 లో పని చేస్తున్న సీనియర్ ఎంవీఐలు జి. రవికుమార్, సీహెచ్. కొండయ్య, ఎం.సురేష్‌బాబులకు ఆర్టీవోలుగా పదోన్నతులు కల్పిస్తు ఉత్తర్వులు జారీ చెశారు. ఇదిలా ఉండగా సీనియర్ అసిస్టేంట్గా చార్మినార్ జోన్ లో పని చేస్తున్న ఎస్.వీ. సామ్యూల్‌పాల్‌కు పదోన్నతి కల్పించి సికింద్రాబాద్ (హైదరాబాద్ నార్త్ కార్యాలయానికి ఏవోగా బదిలీ చేశారు. డి. ప్రభాకర్‌కు ఏవోగా పదోన్నతి కల్పించి హైదరాబాద్ సెంట్రల్ (ఖైరతాబాద్) కార్యాలయంకు బదిలీ చేశారు. అశ్వక్ అహ్మద్ ఖాన్ నిజామికి ఏవోగా పదోన్నతి కల్పించి రాబోయే ఖాళీలో భ ర్తీ చేయనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో నలుగురు సీనియర్ అసిస్టేంట్లు బి. హరిత, కే. రాజశేఖర్, ఎన్.

### సంగీత, టి. రజితలకు ఏవోలుగా పదోన్నతులు కల్పించారు.

అవినీతి ఆరోపణల నేపథ్యంలో గ్రేటర్‌లో ఆర్టీవోలు అందరి బదిలీ

అవినీతి ఆరోపణల నేపత్యంలో హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న రవాణాశాఖ అధికారులందరిని బదిలీ చేస్తు రవాణాశాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.హైదరాబాద్ (ఈస్ట్ జోన్ – మలక్‌పేట) ఆర్టీవోగా పని చేస్తున్న ఎల్. కిష్టయ్యను హైదరాబాద్ సెంట్రల్ జోన్ –1(ఖైరతాబాద్) ఆర్టీవోగా బదిలీ చేశారు. సెంట్రల్ జోన్ –1 (ఖైరతాబాద్) ఆర్టీవో ఎం. పురుషోత్తంరెడ్డిని సూర్యాపేట జిల్లా రవాణాశాఖ అధికారిగా బదిలీ చేశారు. ఇబ్రహీంపట్నం ఆర్టీవో వి. సుభాష్‌చందర్‌రెడ్డిని వికారాబాద్ ఆర్టీవోగా, మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి ఎం. రఘునందన్‌గౌడ్‌ను హైదరాబాద్ ఈస్ట్ (మలక్‌పేట) ఆర్టీవోగా, కోమురంభీం (అసిఫాబాద్) జిల్లా రవాణాశాఖ అధికారి ఎల్. రాంచందర్‌ను.. హైదరాబాద్ సౌత్ (బండ్లగూడ) ఆర్టీవోగా బదిలీ చేశారు. పదోన్నతి పొందిన జి. రవికుమార్‌కు హైదరాబాద్ సెంట్రల్ –2 (ఖైరతాబాద్) ఆర్టీవోగా, సీహెచ్. కొండయ్యకు నాగోల్ డ్రైవింగ్ ట్రాక్ ఆర్టీవోగా, ఎం. సురేష్‌బాబును ఉప్పల్ డీటీవోగా బదిలీ చేశారు. అయితే గ్రేటర్‌లో కీలకమైన మేడ్చల్,ఇబ్రహీంపట్టణం రవాణాశాఖ కార్యాలయాలకు ఆర్టీవోలను ఎవరిని నియమించక పోవడం చర్చనీయాంశంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న 26 మంది మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్లను, ఆరుగురు అసిస్టేంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్లను బదిలీ చేశారు. కేవలం సికింద్రాబాద్ ఆర్టీవో బదిలీ జరగలేదు.

# పేదల సొంతింటి కల సాకారం ఎంపీ కేశినేని చిన్ని

**విజయవాడ జూన్ 1 సిరి న్యూస్:**

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 34 వ డివిజన్ లో పెన్షన్ పంపిణీ కార్యక్రమం లో ఎంపీ చిన్ని పాల్గొన్నారు రాష్ట్రంలోని పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయని, ప్రతి అర్హుడికి గౌరవప్రదంగా పెన్షన్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. “పెన్షన్ అనేది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదు, మన పెద్దల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న గౌరవానికి ప్రతీక అని ఆయన తెలిపారు.లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పెన్షన్లు అందజేస్తూ వారి జీవితాల్లో భరోసా నింపుతున్నామన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది” అని ఎంపీ పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63 నుంచి 64 లక్షల మంది వరకు ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పొందుతున్నారని, ఇందుకోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ.2,700 కోట్లకు పైగా వ్యయం చేస్తోందని తెలిపారు. ఏడాదికి ఈ వ్యయం దాదాపు రూ.33,000 కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజీ పడకుండా ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా, పేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయడానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.273.79 కోట్ల విడుదలకు పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని చెప్పారు. టిడ్కో గృహ సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి వంటి సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడనున్నాయని వివరించారు. దీంతో వేలాది మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ఇళ్ల పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- **ఆమెరికా దళాల దాడులతో మొదటికొచ్చిన వ్యవహారం**



వాషింగ్టన్, జూన్ 1: శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్ లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి. ఆత్మరక్షణ కోసం ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అంతర్జాతీయ జలాలపై ప్రయాణిస్తున్న తమ ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడం, ఇతర దుందుడుకు చర్యలకు ప్రతిస్పందనగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. తమ దాడిలో ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్, రెండు అటాక్ డ్రోన్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. వీటి నుంచి తమ యుద్ధ నౌకలకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది. సిరిక్ ద్వీపంలోని టెలికామ్ టవర్స్‌పై అమెరికా దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యం దాడికి వాడిన ఎయిర్‌బేస్‌ను తాము లక్ష్యంగా చేసుకొన్నామని ప్రకటించింది. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫైటర్స్ ప్రతిదాడి చేశారని తెలిపింది. కానీ, ఏ బేస్‌పై దాడి చేశారో మాత్రం వెల్లడించలేదు. అయితే అంతకు కొన్ని గంటల ముందు కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దాడులను గుర్తించి యాక్టివేట్ అయినట్లు వార్తలొచ్చాయి. హర్మూజ్‌ను నియంత్రించాలంటే ఇరాన్ ఖేష్మ్ మిసైల్ సిటీని కూడా ధ్వంసం చేయడం అమెరికాకు చాలా ముఖ్యం. ఇక్కడ అండర్‌గ్రౌండ్ సిటీలో యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులు ఉన్నాయి. జలసంధిలోని నౌకలను లక్ష్యంగా చేసుకోవడం కోసం వీటిని వాడతారు. గడా 380, హెచ్‌వై–2 సిల్క్‌వార్మ్‌ను ఇరాన్ ఇక్కడ సిద్ధంగా ఉంచింది. ఇక బాలిస్టిక్ క్షిపణుల్లో 800 కిలోమీటర్ల రేంజ్ ఉన్న ఖియామ్–1, ఖైబర్ షెకన్, ఘద్ర, ఎమాద్ మిసైల్స్‌ను భద్రపర్చింది. వీటితోపాటు వేగంగా దాడి చేసే స్పీడ్‌బోట్స్, తీరప్రాంత క్షిపణి బ్యాటరీలు కూడా ఉన్నాయి.

# సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

## సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

## కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల



**న్యూఢిల్లీ, జూన్ 1:** సుప్రీం కోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించినట్లు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ జాబితాలో సీనియర్ న్యాయవాది వి మోహన, ప్రస్తుతం బాంబే హైకోర్టు సీజే జస్టిస్ చంద్రశేఖర్, ప్రస్తుత పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు,ప్రస్తుత మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్, జమ్మూకశ్మీర్ హైకోర్టు సీజే జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. ఇటీవలే సీజేఐ నేతృత్వంలోని కొలీజియం వీరి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీరిలో వి. మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాది. న్యాయవాది మోహన 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్‌ల వద్ద జూనియర్‌గా ఉన్నారు. 1996లో ఏఓఆర్ పరీక్ష పాసైన తర్వాత ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ కేసుల్లో సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, కె.కె.వేణుగోపాల్, పి.చిదంబరం, అరున్–జైట్లీ, అంద్యార్జునలతో కలిసి పనిచేశారు. 2015 ఏప్రిల్ 23న సీనియర్ న్యాయవాది హోదా పొందారు. ఈమె చేరికతో సుప్రీం కోర్టులో మహిళా జడ్జిల సంఖ్య 2కు చేరినట్లయింది.

# నిరసనలకు సిద్ధం కండి..

## నేను వస్తున్నా: కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు






**న్యూఢిల్లీ, జూన్ 1:** తాను జూన్ 6న భారత్‌కు రానున్నట్టు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోమవారం తెలిపారు. పరీక్ష నిర్వహణ లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో శాంతియుత నిరసన కార్యక్రమం చేపడతానని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియో రిలీజ్ చేశారు. ఢిల్లీలో చేపట్టనున్న ఈ నిరసనలో విద్యార్థులు, తన మద్దతుదారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ‘మనందరం ఏకమయ్యేందుకు టైమ్ వచ్చింది. రాజ్యాంగం చూపించిన దారిలో ముందుకు సాగుతూ శాంతియుత మార్గంలో గొంతెత్తాలి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి. కలిసికట్టుగా ముందడుగు వేస్తే వాళ్లు మన మాట వినకతప్పదు’ అని చెప్పారు. ‘జూన్ 6న ఢిల్లీకి వద్దామని అనుకుంటున్నాను. ఎయిర్‌పోర్టుకు మీరందరూ రావాలి. అక్కడి నుంచి మనం పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి శాంతియుత నిరసన కార్యక్రమం కోసం అనుమతి తీసుకుందాం. జంతర్‌మంతర్ వద్ద ఈ నిరసన కార్యక్రమం చేపడదాము’ అని చెప్పారు. పరీక్ష నిర్వహణలో లోపాలు, అవాంతరాల కారణంగా విద్యార్థులు ఆందోళనలో కూరుకుపోయారని అభిజీత్ అన్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా చేసిన కాక్రోచ్ వ్యాఖ్యల నేపథ్యంలో పుట్టుకొచ్చిన కాక్రోచ్ జనత పార్టీ అనతి కాలంలో ఊహించని స్థాయిలో పాప్యులర్ అయిన విషయం తెలిసిందే. అయితే, ఫేక్, బోగస్ డిగ్రీలతో న్యాయవృత్తిలోకి ప్రవేశిస్తున్న కొందరిని ఉద్దేశించే తాను ఆ వ్యాఖ్యలు చేశానని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని అన్నారు. ఇక జాతీయ భద్రతా కారణాల రీత్యా కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ అకౌంట్‌ను కేంద్రం స్తంభింపజేసింది. దీన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టు విచారణ చేట్టింది.

# కాంట్రాక్టర్లకు నితిన్ గడ్కరీ వార్నింగ్



**న్యూఢిల్లీ, జూన్ 1:** జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కాంట్రాక్టర్లకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గట్టిగా హెచ్చరించారు. సోమవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల నిర్వహణపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన ప్రజల ఫిర్యాదుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మంత్రి గడ్కరీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని జాతీయ రహదారుల నాణ్యతపై ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీ ప్రత్యేకంగా చర్చించారు.ఆంధ్రప్రదేశ్‌లో 8,512 కిలోమీటర్ల జాతీయ రహదారుల నెట్‌వర్క్‌పై నితిన్ గడ్కరీ కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రోడ్డు భద్రతపై ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల గుర్తించి.. తక్షణమే నివారణ చర్యలకు ఉపక్రమించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి రహదారుల మన్నికను మరింత పెంచాలని అధికారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు.

# యువకుల మధ్య గొడవ

## యువతిని కారుతో ఢీకొని చంపిన దుండగులు

**చెన్నై, జూన్ 1:** ఓ బార్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ 18 ఏళ్ల యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన చెన్నై నగరంలో చోటుచేసుకుంది. నిందితులైన బాలమురుగన్ (21), జోశ్వ (19), కిషోర్ కుమార్ (19) లను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు విల్లుపురం జిల్లాలో నివసిస్తున్న శ్రీలంక శరణార్థి యాన్సీ (18)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విల్లుపూరం జిల్లాలో నివాసం ఉండే యాన్సీ, ఆమె స్నేహితులు చెన్నైలోని ఓ ప్రైవేట్ బార్‌కి వెళ్లారు. అక్కడ యాన్సీ గ్రూప్ డ్యాన్స్ చేస్తుండగా.. అక్కడే ఉన్న మరో పురుషుల బృందం వాగ్వాదం పెట్టుకుంది. చిన్నపాటి గొడవ చిలికి చిలికి పెద్ద ఘర్షణగా మారింది. ఈ క్రమంలోనే బౌన్సర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలకు సర్ది చెప్పి బయటకు పంపించారు. ఊర్ బయట వెళ్లిన తర్వాత కూడా వారి మధ్య మరోసారి వివాదం చోటుచేసుకుంది. బౌన్సర్లు కూడా మరోసారి రంగంలోకి దిగి రెండు వర్గాలను అక్కడి నుంచి వెళ్లిపోమని కోరారు. దీంతో యాన్సీ, తన స్నేహితురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై తన నివాసానికి బయలుదేరింది. మార్గం మధ్యలో వారి బైక్‌ను ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టారు. అయితే యాన్సీ స్నేహితులు కారుపై రాళ్లు విసరడంతోనే ..వారు ఢీకొట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన యాన్సీ అక్కడికక్కడే మృతి చెందంగా.. ఆమె స్నేహితురాలు తీవ్రంగా గాయపడింది. నిందితులను కఠిన శిక్ష విధించాలని మృతురాలి కుటుంబం కోరింది.

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆత్మహత్య

## అదనపు కట్నం వేధింపులే అంటున్న కుటుంబ సభ్యులు

**లక్నో, జూన్ 1:** పెళ్లైన రెండేళ్లకే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అనుమానాస్పద స్థితిలో మరణించిన సంఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లఖ్‌నవూకు చెందిన సాగర్ రాజ్‌పుత్‌కు 2024లో కాన్పూర్‌కు చెందిన మాన్సితో పెళ్లయింది. మాన్సి తల్లిదం డ్రులు వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చారు. కొంతకా లం వీరి కాపురం బాగానే సాగింది. ఇద్దరూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా స్థానికంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సాగర్‌కు ఇన్‌స్టాలో 8 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కలిసి వీడియోలు చేసే వారు. ఏమైందో ఏమో తెలీదు కానీ, మాన్సి అత్తింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూతురి మరణంపై మాన్సి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదనపు కట్నం కోసం తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. ’పెళ్లి సమయంలో వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చాం. అయినా వాళ్లకు సంతృప్తి కలగలేదు. అదనపు కట్నం కోసం నా కూతురిని హింసిస్తున్నారు. కారు కావాలని అడుగుతున్నారు. తక్కువ కట్నం తెచ్చిందని అంటూ మాన్సిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు’.. వేధింపుల గురించి మాతో చెప్పుకుని మాన్సి చాలా ఏడ్చేది. మాన్సి అత్తింటి వారికి సర్ది చెప్పటం కోసం పలుమార్లు లఖ్‌నవూ వెళ్లి వచ్చాము. మా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని శనివారం ఫోన్ కాల్ వచ్చింది.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.

# తెల్లాపూర్ చెరువులపై కన్నేసిన ఆక్రమణదారులు..!

4

- వరద కాలువల మాయం.. ఎన్ఓసీల జారీపై అనుమానాలు
- జలవనరుల పరిరక్షణకు కలెక్టర్‌ను కోరిన వడ్డే నర్సింహులు



www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
సిరి
People's Voice
వార్త పత్రిక
మంగళవారం
02-06-2026
సంపుటి: (volume):2
సంచిక: (ISSUE):149
MEDAK,SANGAREDDY SIDDIPET
పేజీలు-4

# 'ఎపిటోరియా' ఆగడాలపై ఇంటెలిజెన్స్ ఆరా!

## బోరపట్ల ప్రజాగ్రహంపై నిఘా వర్గాల దృష్టి

- 'సిరి న్యూస్' కథనాల ఆధారంగా కూపీ లాగుతున్న అధికారులు
- 3న సీఎం పర్యటన వేళ కదిలిన ఇంటెలిజెన్స్ వర్గాలు
- ఉద్యోగాల హామీ ఇచ్చి గ్రామస్తులను ముంచిన వైనం..
- లిఫ్ట్ ఇరిగేషన్ పైప్‌లైన్‌పైనే కంపెనీ భారీ నిర్మాణాలు
- కంపెనీ వాటర్ క్యాన్లతో పీసీబీ దొంగ రిపోర్టులు
- న్యారేటికుంట, కంసానికుంట కబ్జా పర్వం
- ప్రమాదాల పరిహారంలోనూ దారుణమైన వివక్ష
- వీటన్నింటిపైనా పూర్తి సమాచారం సేకరించనున్న నిఘా
- చర్చనీయాంశంగా మారిన 'సిరి న్యూస్' కథనాలు




(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్) : బోరపట్ల పరిసర ప్రాంతాల్లో సాగుతున్న 'అరబిందో ఎపిటోరియా తెరేనియం' ఫార్మా కంపెనీ అక్రమాల పుట్టపై ఇంటెలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగాయి. అధికార బలంతో సహజ వనరులను మింగేస్తూ, ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న ఈ కార్పొరేట్ సంస్థపై 'సిరి న్యూస్' నిరంతరం ప్రచురించిన పరిశోధనాత్మక కథనాలు, బాధితులైన బోరపట్ల గ్రామస్తుల ఇబ్బందులపై నిఘా వర్గాలు ముమ్మరంగా ఆరా తీస్తున్నాయి. 3వ తేదీన సీఎం పర్యటన సందర్భంగా గ్రామస్తులు ఏ క్షణమైనా తిరగబడే అవకాశం ఉందన్న పక్కా సమాచారంతో.. కంపెనీ సాగించిన భూకబ్జాలు, కాలుష్య మోసాలు, కార్మికుల మరణాల వ్యవహారాలపై ఇంటెలిజెన్స్ నివేదికలు సిద్ధం చేస్తోంది.

3

# దశాబ్దాల నిరీక్షణకు తెర...

- అమీన్పూర్ అభివృద్ధికి మరో కీలక అడుగు
- నాలాపై బ్రిడ్జికి రూ.4 కోట్లు మంజూరు
- లింగంపల్లి నుంచి అమీన్పూర్‌కు సులువైన రాకపోకలు
- ప్రజల రుణం అభివృద్ధితో తీర్చుకుంటా: ఎంపీ రఘునందన్ రావు



2

# తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు గుర్తింపు ఎక్కడ..?

రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన వారిని విస్మరిస్తున్న రాజకీయ పార్టీలు

- ఉద్యమంలో త్యాగాలు
- రాష్ట్రం వచ్చింది.. గుర్తింపు మాత్రం రాలేదు
- గుమ్మడిదల మండలంలో ఉద్యమకారుల ఆవేదన
- ఉద్యమకారుల గుర్తింపుపై పెరుగుతున్న డిమాండ్



2

## తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులకు గుర్తింపు ఎక్కడ..?



**గుమ్మడిదల, జూన్ 1 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాట పటిమతో పనిచేసిన వేలాది మంది ఉద్యమకారులు నేడు గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రత్యేక తెలంగాణ లక్ష్యంగా విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, రైతులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ ఉద్యమాన్ని గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించారు. అయితే రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడుస్తున్నా, ఉద్యమంలో కీలకంగా పనిచేసిన అనేక మందికి తగిన గుర్తింపు, గౌరవం, అవకాశాలు అందలేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.

### ఉద్యమంలో త్యాగాలు..

తెలంగాణ ఉద్యమ సమయంలో త్యాగాలు చేసినప్పటికీ నేడు గుర్తింపుకు నోచుకోని ఉద్యమ వీరులు ఎంతోమంది ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విమర్శలు, కేసులు, అరెస్టులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఉద్యమాన్ని ముందుకు నడిపించిన వారిలో చాలామంది నేడు రాజకీయంగా, సామాజికంగా పక్కన పడిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. ఉద్యమ స్ఫూర్తిని గ్రామాలకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరిచిన ఉద్యమకారులు రాష్ట్ర సాధన అనంతరం రాజకీయ వ్యవస్థలో సముచిత స్థానం పొందలేకపోయారని పలువురు ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పాటలు, ప్రసంగాలు, ర్యాలీలు, దీక్షలు, నిరసన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన ఉద్యమకారులు నేడు జీవనోపాధి కోసం పోరాడాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారిలో చాలామంది ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులతో కాలం గడుపుతున్నారు. ఉద్యమ సమయంలో ముందుండి పోరాడిన వారికి నేడు రాజకీయ, సామాజిక వేదికలపై తగిన ప్రాధాన్యత లేకపోవడం బాధాకరంగా మారింది.

### గుమ్మడిదల మండలంలో ఉద్యమకారుల ఆవేదన

గుమ్మడిదల మండలంలోని గ్రామాలలో తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకుగా పనిచేసిన ఉద్యమకారులు ప్రస్తుతం బతుకుదెరువు కోసం జీవన పోరాటంలో కొట్టుమిట్టాడుతున్నారు. అదే కాకుండా రాజకీయ పార్టీల్లో తగిన గుర్తింపు పొందలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యమ కాలంలో పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసిన కార్యకర్తలు, నాయకులు నేడు నిర్ణయాత్మక స్థానాల్లో కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం లేని కొత్త నాయకులు పార్టీల్లో ప్రాధాన్యత పొందుతుండగా, కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన ఉద్యమకారులు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన వారికి కనీస కార్యకర్త స్థాయి గుర్తింపు కూడా లేకపోవడం బాధాకరమని పలువురు ఉద్యమకారులు చెబుతున్నారు. తెలంగాణ సాధన కోసం చేసిన త్యాగాలు, పోరాటాలు చరిత్రలో నిలిచిపోయినా, ఆ పోరాట వీరుల జీవన పరిస్థితులు మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడలేదని అంటున్నారు. ఉద్యమకారుల సేవలను ప్రభుత్వం, రాజకీయ పార్టీలు గుర్తించి వారికి ప్రత్యేక గుర్తింపు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి బాటలు వేసిన ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించిన ఉద్యమకారుల కృషికి తగిన గౌరవం దక్కినప్పుడే ఉద్యమ స్ఫూర్తి సార్థకమవుతుంది.

### ఉద్యమకారుల గుర్తింపుపై పెరుగుతున్న డిమాండ్

రాష్ట్ర ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల వివరాలను సేకరించి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, నామినేటెడ్ పదవులు, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించాలని ఉద్యమ వర్గాలు కోరుతున్నాయి. తెలంగాణ ఉద్యమ చరిత్రను భావితరాలకు తెలియజేయడంతో పాటు, ఉద్యమకారుల సేవలకు తగిన గౌరవం కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు.

# దశాబ్దాల నిరీక్షణకు తెర..





**రామచంద్రపురం, జూన్ 1 (సిరి న్యూస్):**

అమీన్పూర్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లింగంపల్లి–అమీన్పూర్ నేరుగా రహదారి అనుసంధానానికి మార్గం సుగమమైందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. లింగంపల్లి చౌరస్తా వద్ద నాలాపై నిర్మించనున్న బ్రిడ్జి పనుల కోసం రూ. 4 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. సోమవారం లింగంపల్లి చౌరస్తా వద్ద ప్రతిపాదిత బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ఏడాది చివర్లో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కన్ననతో కలిసి లింగంపల్లి చౌరస్తా నుంచి అమీన్పూర్ మీదుగా సుల్తాన్పూర్‌లోని రింగ్ రోడ్ ఎగ్జిట్ వరకు రేడియల్ రోడ్ నిర్మాణ అవసరాన్ని వివరించినట్లు తెలిపారు. అమీన్పూర్‌కు జాతీయ రహదారి నుంచి నేరుగా రహదారి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో నాలాగా మారిన వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ఆ ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని అధికారులను కోరినట్లు చెప్పారు. ఈ అంశంపై పలుమార్లు అధికారులతో సమావేశమై ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయగా, జీహెచ్ఎంసీ అధికారులు సానుకూలంగా స్పందించి కార్యాచరణ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దీని ఫలితంగానే నాలాపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 4 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అమీన్పూర్, సుల్తాన్పూర్, బొల్లారం ప్రాంతాలతో పాటు శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా రింగ్ రోడ్‌కు చేరుకోవడం మరింత సులభతరం అవుతుందన్నారు. రాకపోకల సమయం తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తన ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనుల ద్వారానే ప్రజలు తనపై ఉంచిన



నమ్మకానికి ప్రతిఫలం అందిస్తానని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఓటు వేసి గెలిపించిన ప్రజల రుణం అభివృద్ధి ద్వారానే తీర్చుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, శేరిలింగంపల్లి బీజేపీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, దిశ కమిటీ సభ్యులు కాసాల సుధాకర్, బీజేపీ నాయకులు ఎడ్ల రమేష్, రాంబాబు, రాజేందర్ రెడ్డి, రాచమల్ల సంతోష్ పాల్గొన్నారు.




# 'ఎపిటోరియా' ఆగడాలపై ఇంటెలిజెన్స్ ఆరా!

## బోరపట్ల ప్రజాగ్రహంపై నిఘా వర్గాల దృష్టి

- 'సిరి న్యూస్' కథనాల ఆధారంగా కూపీ లాగుతున్న అధికారులు
- 3న సీఎం పర్యటన వేళ కదిలిన ఇంటెలిజెన్స్ వర్గాలు
- ఉద్యోగాల హామీ ఇచ్చి గ్రామస్తులను ముంచిన వైనం..
- లిఫ్ట్ ఇరిగేషన్ పైప్‌లైన్‌పైనే కంపెనీ భారీ నిర్మాణాలు
- కంపెనీ వాటర్ క్యాన్లతో పీసీబీ దొంగ రిపోర్టులు
- న్యారేటికుంట, కంసానికుంట కబ్జా పర్వం
- ప్రమాదాల పరిహారంలోనూ దారుణమైన వివక్ష
- వీటన్నింటిపైనా పూర్తి సమాచారం సేకరించనున్న నిఘా వర్గాలు
- చర్చనీయాంశంగా మారిన 'సిరి న్యూస్' కథనాలు




(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్) :
బోరపట్ల పరిసర ప్రాంతాల్లో సాగుతున్న 'అరబిందో ఎపిటోరియా తెరేనియం' ఫార్మా కంపెనీ అక్రమాల పుట్టపై ఇంటెలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగాయి. అధికార బలంతో సహజ వనరులను మింగేస్తూ, ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న ఈ కార్పొరేట్ సంస్థపై 'సిరి న్యూస్' నిరంతరం ప్రచురించిన పరిశోధనాత్మక కథనాలు, బాధితులైన బోరపట్ల గ్రామస్తుల ఇబ్బందులపై నిఘా వర్గాలు ముమ్మరంగా ఆరా తీస్తున్నాయి. 3వ తేదీన సీఎం పర్యటన సందర్భంగా గ్రామస్తులు ఏ క్షణమైనా తిరగబడే అవకాశం ఉందన్న పక్కా సమాచారంతో.. కంపెనీ సాగించిన భూకబ్జాలు, కాలుష్య మోసాలు, కార్మికుల మరణాల వ్యవహారాలపై ఇంటెలిజెన్స్ నివేదికలు సిద్ధం చేస్తోంది.

### భూములు గుంజుకుని నట్టేట ముంచారు..


కంపెనీ ఏర్పాటు చేసే సమయంలో స్థానిక నిరుద్యోగులకు పర్మినెంట్ (శాశ్వత) ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన 'ఎపిటోరియా తెరేనియం' యాజమాన్యం.. తీరా భూములు తీసుకున్నాక గ్రామస్తులను నట్టేట ముంచింది. స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా, ఇచ్చిన కొద్దిమందిని పర్మినెంట్ చేయకుండా మోసం చేయడంతో నిరుద్యోగుల ఆశలు అడియాశలయ్యాయి. ఈ కార్పొరేట్ సంస్థ భూదాహం ఏ స్థాయికి చేరిందంటే.. సర్వే నంబర్ 379లో కబ్జా పర్వానికి తెరలేపడమే కాకుండా, ఏకంగా కోఆపరేటివ్ బ్యాంకు స్థలాన్ని కూడా ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టింది. ఇన్నాళ్లూ స్థానిక అధికారులు సర్వే పేరుతో దోబూచులాడుతూ గ్రామస్తుల సహనంతో చెలగాటమాడగా.. బాధితులు తమ పనులు వదిలేసి న్యాయం కోసం ఎదురుచూస్తున్న వైనాన్ని నిఘా వర్గాలు గమనించాయి.

### సాగును చంపేసి..

వందల ఎకరాల పచ్చని సాగుభూములను నాశనం చేస్తూ.. ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి అరబిందో తెరేనియం పాతరేసింది. పొలాలకు నీరందించే ప్రధాన భారీ సాగునీటి పైప్‌లైన్‌పైనే కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మించింది. దీనివల్ల సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఎపిటోరియా, కంపెనీ కలిసి గ్రామస్తులను ఇన్నాళ్లూ మభ్యపెట్టిన విషయం కూడా ఇంటెలిజెన్స్ వర్గాల దృష్టిసారించనున్నాయి. బోరపట్ల ప్రజల పక్షాన నిలిచి 'సిరి న్యూస్' ప్రచురించిన ప్రతి కథనం వంద శాతం అక్షర సత్యమని ఇరిగేషన్ శాఖ ఇచ్చిన అధికారిక నివేదికతో తేలిపోయింది. న్యారేటికుంటలో ఏకంగా 38 కుంటల భూమిని కంపెనీ కబ్జా చేయగా.. కంసానికుంట ఎఫ్టీఎల్ పరిధిని, చెరువు గర్భాన్ని పూర్తిగా ఆక్రమించి యథేచ్ఛగా భారీ కట్టడాలు నిర్మించారు. అంతటితో ఆగకుండా ఆక్రమిత స్థలంలో అత్యంత ప్రమాదకరమైన గ్యాస్ పైప్‌లైన్ వేసిన ఉదంతంపై నిఘా వర్గాలకు సమాచారం అందనుంది.

### వర్కర్ల ప్రాణాలతో చెలగాటం..

కంపెనీ లోపల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ఎంతో మంది కార్మికులు దుర్మరణం పాలవుతున్న ఉదంతాలు నిఘా విచారణలో వెలుగుచూశాయి. గత నవంబర్‌లో 20 ఏండ్ల వలస కూలీ స్వపన్ మహాతో ప్రమాదంలో బలవగా, హీరాలాల్ అనే మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అయితే, చనిపోయిన వారి పరిహారంలోనూ అరబిందో దారుణమైన 'లోకల్‌నాన్ లోకల్' వివక్ష చూపిస్తోంది. లోకల్ కార్మికులు చనిపోతే గొడవ కాకుండా లక్షల పరిహారం ఇచ్చిన యాజమాన్యం.. పరాయి రాష్ట్ర వ్యక్తి అయిన స్వపన్ మహాతో చనిపోతే రూపాయి కూడా ఇవ్వకుండా శవాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలించింది. ఈ విషయాలన్నీ 'సిరి న్యూస్' సంచలనాత్మక కథనాలు ప్రచురిస్తూనే ఉంది. కాగా, సీఎం పర్యటన వేళ ఎపిటోరియా కంపెనీ గురించి, బోరపట్ల గ్రామస్తుల బాధల గురించి నిఘా వర్గాలు 'సిరి నూస్' కథనాలు ఆధారంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం.





# తెల్లాపూర్ చెరువులపై కన్నేసిన ఆక్రమణదారులు..!

- వరద కాలువల మాయం.. ఎన్ఓసీల జారీపై అనుమానాలు
- జలవనరుల పరిరక్షణకు కలెక్టర్‌ను కోరిన వడ్డే నర్సింహులు

**రామచంద్రపురం, జూన్ 1 (సిరి న్యూస్):**
వేగంగా విస్తరిస్తున్న తెల్లాపూర్ ప్రాంతంలో చెరువులు, కుంటలు, సహజ వరద కాలువల ఉనికిపైనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకప్పుడు వర్షపు నీటి నిల్వకు, భూగర్భ జలాల సంరక్షణకు ఆధారంగా నిలిచిన జలవనరులు ప్రస్తుతం ఆక్రమణల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధులు, సహజ జలమార్గాలపై నిర్మాణాలు పెరగడం వల్ల భవిష్యత్తులో ముంపు సమస్యలు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.



తెల్లాపూర్ గ్రామ పరిధిలోని మేడికుంట, వనం చెరువు, పడమటి చెరువులు గొలుసుకట్టు వ్యవస్థలో ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి. వనం చెరువు నిండిన తర్వాత అదనపు నీరు సహజ వరద కాలువల ద్వారా పడమటి చెరువుకు చేరే విధంగా ఈ వ్యవస్థ కొనసాగుతోంది. అయితే ప్రస్తుతం ఆ జలమార్గాలపై ఆక్రమణలు, మట్టి పూడ్చివేతలు, నిర్మాణాలు పెరగడంతో నీటి సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.
మేడికుంట చెరువు అలుగు నుంచి ప్రవహించే వరద కాలువకు చెందిన పలు ప్రాంతాలు పూర్తిగా కనుమరుగైనట్లు చెబుతున్నారు. సర్వే నంబర్లు **116, 497, 200, 480, 481, 471, 476, 202, 223** పరిధిలో ఉన్న జలమార్గాలు ఆక్రమణలకు గురయ్యాయని, కొన్ని చోట్ల వరద కాలువలను విభజించి ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.
ఈ పరిస్థితి కొనసాగితే వర్షాకాలంలో నీటి ప్రవాహం నిలిచిపోయి సమీప కాలనీలు, నివాస ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే స్వల్ప వర్షాలకే కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు.



మరోవైపు, వరద కాలువలు, జలమార్గాల పరిధిలోనే నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్ఓసీలు) జారీ అయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.
ఈ నేపథ్యంలో తెల్లాపూర్ గ్రామంలోని చెరువులు, బఫర్ జోన్లు, వరద కాలువలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని, ఆక్రమణలను గుర్తించి తొలగించాలని, నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన ఎన్ఓసీలపై విచారణ చేపట్టాలని సాగునీటి సంఘం మాజీ చైర్మన్ వడ్డే నర్సింహులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు



సమర్పించిన వినతిపత్రంలో కోరారు. సహజ జలవనరులను పరిరక్షించేందుకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.